కారుతో సహా 23ఎర్రచందనం దుంగలు స్వాధీనం

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 8 ప్రభాతవార్త : రాజంపేట అటవీ ప్రాంతంలో టాస్క్ ఫోర్స్ పోలీసులు ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి, కారుతో సహా 23 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్సు ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ ఎస్పీ పీ.శ్రీనివాస్ అధ్వర్యంలో డీఎస్పీ జీ.బాలిరెడ్డి సూచనల మేరకు కడప జిల్లా టాస్క్ ఫోర్సు సబ్ కంట్రోల్ ఆర్ఐ చిరంజీవులకు చెందిన ఆర్ఎస్ఐ పీ. నరేష్ బృందం అన్నమయ్య జిల్లా రాజంపేట పరిధిలోని అటవీ ప్రాంతంలో అటవీ శాఖా సిబ్బందితో కలసి కూంబింగ్ నిర్వహించారు. ఎస్ఆర్ పాలెం వద్ద శుక్రవారం కొంత మంది వ్యక్తులు కారులో ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తూ కనిపించారు. టాస్క్ ఫోర్సు పోలీసులు వారిని హెచ్చరించి చుట్టుముట్టగా ముగ్గురు వ్యక్తులు పట్టుబడగా మిగిలిన వారు పారిపోయారు. వారిలో ఇద్దరికి కడప జిల్లాకు చెందిన వారుగాను, ఒకరిని తమిళనాడు రాణిపేట జిల్లాకు చెందిన వాడిగా గుర్తించారు. పారి పోయిన వారి కోసం గాలిస్తున్నారు. పట్టుబడిన వారిని, దుంగలు, కారుతో పాటు తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించారు. విచారణలో ఈ ముగ్గురు స్మగ్లర్లపై గతంలోనూ కేసులు ఉన్నట్లు గుర్తించారు. టాస్క్ ఫోర్సు సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

విజన్ 2047 లక్ష్యంగా సీఎం కృషి

- క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, శాప్ ఛైర్మన్ రవినాయుడులు

యూత్ ఫెస్టివల్ ప్రారంభోత్సవసభలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి,శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి (క్రీడ), నవంబర్ 8 ప్రభాతవార్త: యువత భవిష్యత్ కోసం సీఎం నారా చంద్రబాబు నాయుడు దృష్టి సారిస్తున్నారని, విజన్ 2047 లక్ష్యంతో రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని యువజన, క్రీడాశాఖమంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీలో డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ ఎఫైర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన యువతరంగ్24 యూత్ ఫెస్టివల్ శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ(శాప్) ఛైర్మన్ అనిమిని రవి నాయుడుతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి యూత్ ఫెస్టివల్‌ను వారిరువురూ ప్రారంభించారు. ఈ సందర్భంగా 35 అనుబంధ కళాశాలల నుంచి విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని నృత్యప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవసభలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశానికి యువతే వెన్నెముకని, యువత సన్మార్గంలో నడిచి భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలన్నారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలనే ఆశయంతో సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారన్నారు. యువత డ్రగ్స్ మహమ్మారి నుంచి బయటపడాలని, పెడత్రోవ పట్టిన యువత మార్పునకు కల్చరల్, స్పోర్ట్స్ దోహదపడతాయన్నారు. సీఎం చంద్రబాబు విజన్ 2047 లక్ష్యంతో రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. విభజన అనంతరం తిరుపతి ఎయిర్పోర్టును ఆనుకుని ఉన్న కంపెనీలను తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుదేనన్నారు. రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటున్నామని, కార్పొరేట్, టెక్నాలజీ కంపెనీలన్నీ ఆంధ్రప్రదేశ్ వైపే చూస్తాన్నాయన్నారు. అనంతరం శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడులు మాట్లాడుతూ తిరుపతి వేదికగా వరల్డ్ క్లాస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటుకు త్వరలోనే భూమిపూజ చేస్తామని, క్రీడావేదికగా తిరుపతి ఎస్వీ యూనివర్సిటీని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. విద్యార్థి, యువత భవిష్యత్ కోసం సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని, క్రీడారంగానికి పెద్దపీట వేసి క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. యువతను క్రీడలపై దృష్టి పెట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఉద్యోగ కల్పనలో స్పోర్ట్స్ కోటాను 2శాతం నుంచి 3శాతానికి పెంచిన ఏకైక సీఎం చంద్రబాబేనని, ఒలింపిక్స్ క్రీడాకారుల ప్రోత్సాహకాలను రూ.70లక్షల నుంచి రూ.7కోట్లకు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించిన క్రీడాకారులకు యూనిఫాం ఉద్యోగాల్లో డైరెక్ట్ రిక్రూట్మెంట్ అమలు చేయనున్నామన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో క్రీడాపాలసీలు లేవని, క్రీడారంగాన్ని నిర్వీర్యం చేశారని దుయ్య బట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. విద్యాశాఖలో అనేక మార్పులు తీసుకొస్తూనే క్రీడారంగాన్ని ప్రోత్సహిస్తున్న ఏకైక విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. రాష్ట్రంలోని యువతకు స్థానికంగా ఉద్యోగావకాశాలు కల్పించేందుకు విదేశీ కంపెనీలను రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే దిశగా మంత్రి లోకేష్ విదేశీ కంపెనీలతో సమావేశమయ్యారన్నారు.

ఇప్పటికే పలు కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కూడా చేసుకుందన్నారు. స్కూల్ స్థాయి నుంచే విద్యార్థులు క్రీడల్లో రాణించేలా మంత్రి లోకేష్ కృషిచేస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా 4057 పాఠశాలల్లో స్కూల్ గ్రౌండ్స్ ఏర్పాటుకు జీవో తీసుకొచ్చారన్నారు. ఎస్వీ యూనివర్సిటీ క్రీడారంగం అభివృద్ధికి ఖేలో ఇండియా, శాప్ నుంచి నిధులు కేటాయించేందుకు కృషి చేస్తామని, యువత క్రీడల్లో రాణించి స్పోర్ట్స్ కోటాను సద్వినియోగం చేసుకోవాలని శాప్‌ఛైర్మన్ కోరారు. ఈ కార్యక్రమానికి ముందుకు శాప్ ఛైర్మన్ జెండా ఊపి యూత్ ఫెస్టివల్ ర్యాలీని ప్రారంభించారు. అలాగే యూనివర్సిటీ విద్యార్థులు ఫ్లాష్‌మాబ్ ప్రదర్శించి ముఖ్యఅతిథులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సీహెచ్ అప్పారావు, ప్రొఫెషర్లు నాదాల భూపతినాయుడు, పీవీ నరసింహ, రాం ప్రసాద్‌రెడ్డి, ఎమ్.చంద్రారెడ్డి, యూనివర్సిటీ అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

గోకులం షెడ్ల నిర్మాణాల్లో... తప్పనిసరిగా జియో ట్యాగింగ్

గోకులం షెడ్ల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షిస్తున్న కలెక్టర్

చిత్తూరు, నవంబర్ 7 ప్రభాతవార్త: గోకులం షెడ్ల నిర్మాణాలకు సంబంధించి వెటర్నరీ అసిస్టెంట్లు, ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వర్తించి క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన పెంచాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ద్వామా, పశుసంవర్ధకశాఖ ఎడిలు, ఎపిఓలు, వెటర్నరీ డాక్టర్లను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం నుండి శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలో గోకులం షెడ్ల పురోగతిపై ద్వామా పిడి రవికుమార్, పశుసంవర్ధకశాఖ జెడి డాక్టర్ ప్రభాకర్‌తో కలిసి ఎడిలు, ఎపిఓలతో సమీక్షించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2,327 గోకులం షెడ్లు మంజూరు కావడం జరిగిందని, ఇందులో 1,911 గోకులం షెడ్లకు టెక్నికల్ శాంక్షన్లు ఇవ్వడం జరిగిందన్నారు. అలాగే 1,377 గోకులం షెడ్లకు సంబంధించి జియో ట్యాగింగ్ పూర్తి చేయడం జరిగిందని, ఇప్పటి వరకు 460 గోకులం షెడ్లు గ్రౌండింగ్ కావడం జరిగిందన్నారు. గోకులం షెడ్లు మంజూరైన చోట టెక్నికల్ శాంక్షన్ వచ్చిన వెంటనే జియో ట్యాగింగ్ తప్పనిసరిగా చేసి ప్రారంభించాలన్నారు. పాడి రైతులు గోకులం షెడ్లు నిర్మించుకునే విధంగా పశుసంవర్ధకశాఖ సహాయకులు క్షేత్ర స్థాయిలో అవగాహన పెంచే విషయంలో ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బందితో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్ళాలన్నారు. మండలాల వారీగా మంజూరైన పనుల్లో ప్రారంభించని పనులకు గల కారణాలను ఎడిలు, ఎపిఓలు సమీక్షించాలన్నారు. అలాగే పశుసంవర్ధక శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి వీటి పురోగతిని సమీక్షించాలన్నారు. ప్రతి మండలానికి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయడానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టి పని చేయాలని, వారంకు ప్రతి మండలంలో 10 నుండి 15 షెడ్ల వరకు గ్రౌండింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే వంద శాతం టెక్నికల్ శాంక్షన్, జియోట్యాగింగ్ చేయడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నమూనా ప్రకారం గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మండలాల వారీగా మంజూరైన గోకులం షెడ్ల పనులను సమీక్షించారు.

కలుపు యాజమాన్యంపై అవగాహన ఉండాలి

- తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త మహేశ్వర్‌రెడ్డి

నాయుడుపేట, నవంబర్ 8 ప్రభాతవార్త : ఆయా మండలాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పనిచేసే వ్యవసాయ సహాయకు లందరు కలుపు నివారణ యాజమాన్య పద్ధతులపై క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలని తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త మహేశ్వర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం నాయుడుపేట పట్టణంలోని స్త్రీ శక్తి భవనంలో నాయుడుపేట, పెళ్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల వ్యవసాయ సహాయకులకు నెలవారీ శిక్షణ కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మహేశ్వరరెడ్డి, జిల్లా వనరుల కేంద్రం ఎడిఎ లక్ష్మీదేవి, ఎఓ శశిధర్‌రెడ్డిలు, విఎఎలు రైతులకు అందించాల్సిన వ్యవసాయపరమైన సూచనలు, సలహాలు వివరించారు. ఈ సందర్భంగా కలుపు నివారణ యాజమాన్య పద్ధతులపై వివరించారు. ఏ పంటకు ఏ దశలో కలుపు మందు వాడాలో, కలుపు రాకముందు, వచ్చిన తర్వాత ఏ రకాల మందులు రైతులు వినియోగించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల వ్యవసాయ సహాయకులతో పాటు నాయుడుపేట ఎడి సుచేంద్రప్రసాద్, పెళ్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల వ్యవసా యాధికారులు ప్రవీణ, దీప, నిరంజన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగంగా బెల్ట్ షాపుల వేలం పాటలు!

-పట్టించుకోని సంబంధిత అధికారులు

వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

దొరవారిసత్రం, నవంబర్ 8 ప్రభాతవార్త : దొరవారిసత్రం మండల పరిధిలోని గ్రామాల్లో బెల్టు షాపులు సెలయేరులా నిర్వహిస్తున్నారు. మండలంలోని శ్రీధనమల్లి గ్రామంలో గురువారం రాత్రి వేలం పాటలో కొంత వరకు వివాదాలు చోటుచేసుకున్నాయి. గ్రామల్లో బెల్టు షాపులకు టిడిపి నాయకుడు, మాజీ సర్పంచ్ ఆధ్వర్యంలో బెల్టు షాపు ఏర్పాటుకు వేలం పాట ఏర్పాటు చేసారు. దీంతో గ్రామంలో మరికొందరు గ్రామంలో బెల్టు షాపులు పెట్టకుడదంటూ ఆ వేలం పాటను అడ్డుకోగా మాజీ సర్పంచ్, అతని అనుచరులు వారిపై వివాదానికి దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య వాదోపదాలు చోటు చేసుకున్నాయి. దీంతో టిడిపి నేత, మాజీ సర్పంచ్ వర్గానికి చెందిన వారు 1.60 లక్షలకు వేలం పాట నిర్వహించి మద్యం బెల్టు షాపును ఏర్పాటు చేసారు. అయితే ఆ గ్రామంలో ఏవరు వచ్చినా మేము చూసుకుంటాం అంటూ బహిరంగంగానే బెల్టు అడ్డుకున్న వారిపై వివాదానికి దిగడంతో గ్రామమంతా ఒక్క సారిగా ఉలిక్కిపడింది. గ్రామంలో ఓ అధికారి కూడా బెల్టు షాపు నిర్వ హణకు ప్రధాన పాత్ర, సూత్రదారి. దొరవారిసత్రం మండలంలో శ్రీధనమల్లి గ్రామంలో ఒక్కసారిగా జరిగిన బెల్టు షాపు వివాదం మండలమంతా పాకింది. ఇప్పటికి మండలంలోని మీజూరు, తొగరాముడి, సింగనాలటూరు, పూలతోట, వేనుంబాక, కల్లూరు, ఉచ్చూరు, బూదూరు, నేల పట్టు, తదితర గ్రామాల్లో బెల్టు షాపులను బహిరంగంగానే ఏర్పాటు చేసి మద్యంను అమ్మకాలు జరుపుతున్నారు. అయితే మద్యం షాపులు నిర్వాహకులు రెండు వర్గాలుగా రాజీ కుదుర్చుకుని బెల్టును సమానంగా పంచుకుంటూ అధికారులను వారి కన్నుసన్నుల్లో ఏర్పాటు చేసుకుని బెల్టు షాపు నిర్వాహం చేస్తున్నారు. అయితే ప్రశాంతంగా ఉన్న గ్రామాలు గత నెల రోజుల నుంచి నిరంతరం మద్యం మత్తుకు బానిసై ఏదో ఒక వివాదాలకు కారణమౌతున్న పోలీసు స్టేషన్ మెట్లు ఎక్కుతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బెల్టు నిర్వహిస్తే తాట తీస్తామని ఆదేశాలు జారీ చేసిన డిసి సత్రంలో మాత్రం తెలుగు తమ్ముళ్ల హవా సాగుతుంది ఆదేశాలను లెక్కచేయకుండా విచ్చలవిడిగా మద్యం బెల్టు షాపులను ఏర్పాటు చేసి లక్షల్లో పోగుచేసుకుంటూ గ్రామాల్లో చిచ్చు పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బెల్టునిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉపాధిహామీ నిధులతోనే గ్రామాల అభివృద్ధి

-సామాజిక తనిఖీ ప్రజావేదికలో పీడీ శ్రీనివాసప్రసాద్

సత్యవేడు, నవంబరు 8 ప్రభాతవార్త: మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం నిధులతోనే పల్లెలు అభివృద్ధి చెందుతున్నట్లు తిరుపతి జిల్లా ఉపాధిహామీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసప్రసాద్ పేర్కొన్నారు. సత్యవేడు మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో చంద్రశేఖర్ అధ్యక్షతన ఉపాధి ప్రోగ్రామ్ అధికారి కృష్ణయ్య పర్యవేక్షణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక జరిగింది. ఉపాధిహామీ పథకం పీడీ శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా మంజూరు అవుతున్న నిధులను కేవలం కూలీలకే గాక, పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు వినియోగిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే నేడు సిమెంటు రోడ్లు, మురుగఉ కాలువల నిర్మాణాలు, పక్కా గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, శ్మశాన వాటికల అభివృద్ధి వంటి వాటి కూడా ఉపాధి నిధులను ఖర్చు పెడుతున్నట్లు వివరించారు. ఉపాధిహామీ పథకం అమల్లో సత్యవేడు మండలం అగ్రగామిగా ఉందన్నారు. తదనంతరం 28 పంచాయతీల్లో ఉపాధిహామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బృందం జరిపిన పరిశీలన నివేదిక అంశాలను ఎస్.ఆర్.పీ.వెంకయ్య ఆధ్వర్యంలో డీఆర్పీలు వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఒక లక్షా 65 వేల రూపాయలు దుర్వినియోగం అయినట్టు బట్టబయలయ్యాయి. ఇందులో ఫోటోలు చూపకపోవడం, మాస్టర్ కొలతల వ్యత్యాసం, నామ ఫలకాలు లేకపోవడం వంటికి సంబంధించి ఒక లక్షా 7వేల రూపాయల రికవరీ చేయడానికి పీడీ ఆదేశించగా, 54వేల రూపాయలు జరిమానా విధించారు. దీంతో పాటు ఆర్‌డబ్ల్యుఎస్ పనుల గోల్మాల్లో 3వేల రూపాయల రికవరీకి కూడా ఆదేశించారు. ఈ క్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆశ వర్కర్లకు పనులు కల్పిస్తూ ఉపాధి పనుల బిల్లులు చెల్లించడంతో పీవీపురం ఫీల్డ్ అసిస్టెంట్ ధనంజయను సస్పెండ్ చేస్తూ ఆయన వద్ద నుంచి 48వేల రూపాయలను రికవరీ చేయాల్సిందిగా ఉపాధిహామీ పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆదేశించారు. దీంతో పాటు ఒకరికి బదులు మరొకరైన గర్భవతులు, బాలింతలు 8మందికి పనులు కల్పించి బిల్లులు ఇవ్వడంతో సిరుణంబుదూరు ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ శేఖర్‌ని కూడా సస్పెండ్ చేశారు. కాగా ఉపాధిహామీ పథకంలో కూలీలకు పనులు కల్పించి నిర్దేశత లక్ష్యాన్ని సాధించిన మదనంజేరి ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజును ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసప్రసాద్, ఎంపీడీవో చంద్రశేఖర్ తదితరులు శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ ఏపీడీ ప్రేమ్‌కుమార్, సచివాల య ఇంజనీర్ అసిస్టెంట్ భానుప్రకాష్, ఉపాధిహామీ ఇంజనీర్ సుమలత, టెక్నికల్ అసిస్టెంట్లు మనోహర్, మహేష్,సిసిందర్, పంచాయతీరాజ్ విస్తరణాధికారి తరుణాక్షరెడ్డి, సర్పంచ్‌లు శేఖర్, జయ, జనసేన మండల అధ్యక్షులు రూపేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

దాతలను మరింత ప్రోత్సహించేందుకు టిటిడి కార్యాచరణ !

-అన్ని ట్రస్ట్‌లు, పథకాలకు విరాళాల సేకరణ

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల

ప్రపంచప్రసిద్ధిగాంచిన హిందూ ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం దాతలను ప్రోత్సహించే దిశగా కార్యాచరణ సిద్ధంచేస్తున్నట్లు తెలుస్తోంది. భక్తులకు సేవలందించడమేగాక ప్రజలకు అవసరమైన వైద్యం.విద్య పరంగా మెరుగైన సేవలందించేందుకు టిటిడి ఇప్పటికే చొరవచూపుతోంది. ఇందుకోసం తిరుమల తిరుపతి దేవస్థానం అమలుచేస్తున్న పలు రకాల ట్రస్ట్‌లు, పథకాలను దాతల విరాళాలతోనే నిర్వహిస్తున్నారు. ఎస్వీఅన్నప్రసాదం, ఎస్వీప్రాణదానం, విద్యాదానం, గోసంరక్షణట్రస్ట్, వేదపరి రక్షణట్రస్ట్, ఎస్వీసర్వ శ్రేయట్రస్ట్, బాలాజీ ఆరోగ్య వరప్రసాదిని ట్రస్ట్,కాటేజీ దాతల పథకం వంటి అనేక రకాల పథకాలు టిటిడి నిర్వహిస్తోంది.ఈ విభాగాలన్నిటికీ ఒక డిప్యూటీ ఇఓను నియమించి పర్యవేక్షిస్తోంది. వీటిల్లో ఎస్వీఅన్నప్రసాదం ట్రస్ట్‌కు ఇప్పటికే దేశవిదేశాల్లోని కోటీశ్వరులైన, ధనవంతులైన భక్తులు దాతలుగా వేలకోట్ల రూపాయలు విరాళాలుగా ఇచ్చారు. ప్రాణదానం ట్రస్ట్‌కు విరాళాలు అందుతున్నాయి. ఇదివరకు టిటిడి దాతల నుంచి నగదు రూపంలో (డిడిలు, చెక్కులరూపంలో) మాత్రమే విరాళాలు సేకరిస్తోంది. ఇలా పెద్దమొత్తంలో విరాళాలిచ్చిన దాతలకు టిటిడి పలు రకాల ప్రయోజనాలను కల్పిస్తోంది. తిరుమలకు వచ్చిన దాతలకు ఏడాదిలో వసతి, శ్రీవారి దర్శనంలో ప్రత్యేక సౌకర్యాలు కేటాయిస్తుంది. ఇప్పుడు టిటిడి అధికారులు ఎంతో ప్రతిష్టాత్మకంగా తిరుపతిలో శ్రీపద్మావతి చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని సుమారు 300కోట్లరూపాయల అంచనాతో నిర్మిస్తోంది. ఇప్పటికే తిరుపతిలోని బర్డ్ ఆస్పత్రి ప్రాంగణంలో పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం ఏర్పాటుచేసి సుమారు వెయ్యిమందికి పైగా చిన్నపిల్లలకు ఉచితంగా గుండె శస్త్రచికిత్సలు నిర్వహించారు. ఇప్పుడు నిర్మించనున్న పద్మావతి మల్టీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంలో భాగంగా అవసరమైన వైద్యపరికరాలు విరాళంగా అందించినా ఆ దాతలకు ప్రయోజనాలు అందించేలా ప్రణాళికలు గత పాలకమండలినే రూపొందించింది. వస్తురూపంలో కూడా విరాళాలిచ్చిన దాతలకు అన్ని రకాల ప్రయోజనాలు వర్తింపజేసేలా నిర్ణయించారు. ఇప్పటికే పలురకాల ట్రస్ట్‌లు, పథకాలకు లక్షలమంది దాతలు ఉన్నారు. ఈ దాతలను మరింతగా ప్రోత్సహించి గోసంరక్షణతో బాటు ప్రాణదాన ట్రస్ట్‌ను, ఆరోగ్యవరప్రసాదినిని మరింత బలోపేతం చేసి పటిష్టంగా అమలు చేయడానికి చూస్తున్నారు. ఇప్పటికే టిటిడి తిరుమల వెంకన్నకు గోఆధారిత వ్యవసాయంతో పండించిన పంటల ఆహార పదార్థాలతో తయారుచేసిన నైవేద్యం సమర్పిస్తోంది. ఈ నైవేద్యం భక్తులకు పంపిణీచేస్తున్నారు. దాతలు తమ విరాళాలను ఈ హుండీ ద్వారా, ఆన్‌లైన్‌లో తమతమ బ్యాంకు అకౌంట్ల నుంచి కూడా పంపే సౌలభ్యం తీసుకువచ్చారు.

కుప్పం డిపోకు త్వరలో... ఎలక్ట్రిక్ బస్సులు

- ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

బస్సులు ప్రారంభిస్తున్న ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్

కుప్పం, నవంబర్ 8 ప్రభాతవార్త : కుప్పం ఆర్టీసీ డిపోకు సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో కాలుష్యరహిత ఎలక్ట్రిక్ బస్సులను తీసుకువస్తామని ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక డిపోలో కుప్పం నుంచి తిరుపతికి రెండు నూతన బస్సులను ఆయన ప్రారంభించారు. ఆయనే స్వయంగా బస్సును స్థానిక శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయం దాకా నడిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుప్పం ఆర్టీసీ డిపో ప్రక్షాళన చేస్తున్నట్లు పేర్కొన్నారు. కుప్పం ఆర్టీసీ డిపోను సుమారు 60 కోట్ల రూపాయల నిధులతో మోడల్ బస్‌స్టేషన్‌గా మార్చడం జరుగుతుం దన్నారు. వచ్చే శుక్రవారం కుప్పం డిపోలో ప్రయాణీకుల సదస్సు ఏర్పాటు చేసి ఆర్టీసీ సమస్యలపై ప్రజల నుంచి వినతులు సీ్వకరించడంతో పాటు సాధ్యమైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, డిపో మేనేజర్ గోపీనాథ్, రాష్ట్ర నేతలు గోపీనాథ్, డా॥ వెంకటేష్,మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జ్ రవి, కౌన్సిలర్లు సోమశేఖర్, సురేష్, వేలు, ఎంఆర్ సురేష్, నేతలు చెక్కు నత్తం మణి, జెఎ ంసి మురళి, జెకె సంతోష్, గిరి, జనసేన నేతలు నరేష్, చంద్రశేఖర్, ఎన్ఎంయుఎ నేత మునెప్ప, తెలుగుమహిళనేత సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

వావిల్‌తోట వయా... గుడిపాల టు వేలూరు

- జోరుగా ఇసుక అక్రమ రవాణా

చిత్తూరు, నవంబర్ 8 ప్రభాతవార్త: ఎక్కడైనా అక్రమ రవాణా జరుగాలంటే అది ఇరు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లోని ప్రదేశాల నుండి ఎక్కువ అక్రమ రవాణా జరిగే అవకాశం వుంటుంది. అలా కాకుండా ఒక రాష్ట్ర మధ్య భాగం నుండి మరొక రాష్ట్ర సరిహద్దుకు అక్రమ రవాణా చేయాలంటే ఇది కష్టం. అయితే ఇప్పుడు కొంచెం కష్టమైనప్పటికీ రిస్కు పెద్దగా వుండదని భావించి పూతలపట్టు మండలం నుండి తమిళనాడు రాష్ట్రానికి ఇసుకను అక్రమంగా తరలించడానికి సిద్ధం అయ్యారు. చిత్తూరు నియోజకవర్గ పరిధిలో ఇసుక అక్రమ రవాణా కష్టం కావడంతో ఇప్పుడు అక్రమార్కులు పూతలపట్టు నియోజకవర్గ పరిధిలోని మండలాలపై కన్నేశారు. పూతలపట్టు మండలం వావిల్ తోట సమీపంలోని నీవానది నుండి ఇసుక తెచ్చుకుని వావిల్‌తోట పరిసరాల్లోనే డంప్ చేసుకుని అక్కడి నుండి గుడిపాల మంలడం ఆపై తమిళనాడు రాష్ట్రానికి తరలించేస్తున్నారు. ఈ వ్యవహారం గత కొంతకాలంగా జరుగుతున్నప్పటికీ పూతలపట్టు మండలం నుండి స్థానికంగా ఇసుక రవాణా జరుగుతుందని అధికారులు మిన్నకుండి పోతున్నారు. అయితే ఈ ఇసుకను అక్రమంగా గుడిపాల మండలానికి తీసుకెళ్ళి అక్కడి నుండి తమిళనాడు రాష్ట్రం వేలూరు, రాణిపేటలకు తరలిస్తున్నారు. అక్కడి నుండి ట్రిప్పర్ల ద్వారా బెంగళూరు, చెన్నై నగరాలకు ఇసుక అక్రమంగా తరలివెళ్తున్నది. ఈ విషయంపై స్థానిక పోలీసులు ప్రత్యేక దృష్టి సారిస్తే పూతలపట్టు మండలం వావిల్‌తోట పరిసర ప్రాంతాల నుండి ప్రస్తుతం జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయవచ్చును.

మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమానా

చిత్తూరు, నవంబర్ 8 ప్రభాతవార్త: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన 18 మంది వాహనదారులకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఉమాదేవి 1.80 లక్షల రూపాయలను జరిమానా విధించారు. జిల్లా కేంద్రం చిత్తూరు ట్రాఫిక్ పోలీసులకు గురువారం మద్యం సేవించి వాహనాలు నడుపుతూ 18 మంది పట్టుబడ్డారు. వీరిని కోర్టుకు హాజరు పరచగా జడ్జి ఉమాదేవి ఒకొక్కరికి 10 వేల రూపాయలు చొప్పున జరిమానా విధించారు. ఈ మేరకు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన మొత్తం 18 మంది 1.80 లక్షల రూపాయల జరిమానా చెల్లించారు.

గ్రామాలకు ఆర్టీసి బస్సు సౌకర్యం పునరుద్ధరణ

గుడుపల్లి,నవంబరు 8 ప్రభాతవార్త : మండలంలోని తిమ్మనాయనపల్లి, దిన్నెపల్లి, సోడిగానిపాళ్యం, యనమ నాశనపల్లి, గ్రామాల మీదుగా తమిళనాడు వేపనపల్లికి శుక్రవారం నూతన బస్సును ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశలతో రాష్ట్ర ఎపియస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పియస్ మునిరత్నం,ఎంయల్సి కంచర్ల శ్రీకాంత్,చోరవతో మరియూ స్థానిక నేతలు నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వినర్ ఆర్.చంద్రశేఖర్,మండల అధ్యక్షుడు టియమ్.బాబు,మాజీ మండల అధ్యక్షుడు హేమాంబర్ గౌడు,మాజీ ఎంపిపి మునిరాజు,మాజీ జడ్పిటిసి బేటప్పనాయుడు,నేతలు బాలచంద్ర, చెన్నప్ప, శంకరప్ప తదితరులు నూతన బస్సు సర్వీసును పురుద్ధరించేందుకు కృషిచేశారు

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు...

ఒకరు దుర్మరణం మరో వ్యక్తికి తీవ్రగాయాలు.

పెద్దపంజాణి నవంబరు 8 ప్రభాతవార్త : మదనపల్లి-పలమనేరు జాతీయ రహదారిలో శుక్రవారం తులసమ్మగుడి సమీపంలో ఓ ద్విచక్ర వాహనాన్ని ఓ కారు వేగంగా వచ్చి ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా మరో వ్యక్తి కాలువిరిగి తీవ్రంగా గాయపడ్డాడు. పలమనేరు పట్టణం రంగాపురం ప్రాంతానికి చెందిన అస్గర్ కుమారుడు అఫ్సర్(19) అనారోగ్యం కారణంగా ఉండటంతో గంగవరం మండలం నడింపల్లికి చెందిన వెంకటరమణ కుమారుడు బి.లక్ష్మీనారాయణ (30) ఆలియాస్ చరన్‌తో కలిసి ద్విచక్ర వాహనంలో మదనపల్లెలోని ఓ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని మరలా పలమనేరుకు తిరుగు ప్రయణమయ్యారు. మార్గమధ్యంలో తులసమ్మగుడి సమీపంలోని ఓ మలుపు వద్ద పుంగనూరు మండలం మాగాండ్లపల్లి పంచాయతీ మీర్జేపల్లికి చెందిన పి.శ్రీనివాసులు ఆయన కారులో (ఎపి16సిఎల్5924) వేగంగా వస్తూ ఎదురుగావస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో బి.లక్ష్మీనారాణ అక్కడికక్కడే మృతిచెందగా, అఫ్సర్‌కు కాలువిరిగి తీవ్రగాయాల య్యాయి. స్థానికులు గుర్తించి 108లో పలమనేరుకు తరలించగా అతని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకోసం చిత్తూరు ఆసుపత్రికి తరలించారు. మృతిచెందిన లక్ష్మీనారాయణను శవపంచనామా నిమిత్తం పలమనేరు ప్రభుత్వఆసుపత్రికితరలించారు. పెద్దపంజాణి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నఖ్విల్లాఖాన్‌కు ఉర్దూ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు

పుంగనూరు,నవంబరు 8 ప్రభాతవార్త : పట్టణానికి చెందిన జడ్పీఉర్దూ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నఖ్విల్లాఖాన్‌కు రాష్ట్రప్రభుత్వం హజరత్‌షా కమాల్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డుప్రకటించింది. ఉర్దూ అకాడమీ మౌలానా అబుల్ కలాంఆజాద్ జన్మదినం సందర్భంగా ప్రతిఏటా మైనార్టీ ఎడ్యుకేషన్, వెల్ఫేర్‌డో సందర్భంగా లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు అందచేస్తుంది. ఈక్రమంలో ఉర్దూ భాషలో నఖ్విల్లా ఖాన్ టిప్పుసుల్తాన్ గురువు అయిన హజరత్ షాకమాల్ మీద అధ్యయనం చేసినందుకు గతంలో ఎస్వీయూనివర్సిటీ పిహెచ్‌డి ప్రదానం చేసింది. ఈయన ఉర్దూ భాషాభివృద్ధికిచేసిన సేవలకుగానూఈనెల11న రాష్ట్రముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈఅవార్డు ఆయనకు అందచేయ నున్నారు.

త్యాగరాజస్వామి గుడికి పన్ను విధింపు

పుంగనూరు,నవంబరు 8 ప్రభాతవార్త : సంగీత ప్రపంచ చక్రవర్తి, భారతీయ సంగీత కళానిధి,సాక్షాత్తు శ్రీరామచంద్రుల దర్శనం సాధించిన అపర గాన గంధర్వుడు త్యాగరాజస్వామి వారి ఆలయానికి కూడా ఇంటిపన్ను విధించి పుంగనూరు మున్సిపల్ అధికారులు తమ ప్రతిభ చాటుకున్నారు. పట్టణంలో పాతికేళ్ళక్రితం త్యాగరాజస్వామివారి ఆలయాన్ని నాయా బ్రాహ్మణసంఘం వారు నిర్మించుకున్నారు. దాతలు,హిందూసంఘాలు అందించిన విరాళలతో నిర్మించిన ఈఆలయంలో త్యాగరాజస్వామివారికి చాలా కాలం పూజలు కూడా జరగలేదు. ఈక్రమంలో సంఘానికి కొత్త కార్యవర్గం ఏర్పాటయింది. అయితే,పన్ను విధింపు నిర్వహించే క్రమంలో మదింపుదారులు ఏకంగా త్యాగరాజ స్వామివారి ఆలయానికి కూడా పన్నులు విధించి,22వేలు బాకీ ఉన్నట్లు నోటీలు జారీచేశారు. సంఘానికి బాధ్యత వహిస్తున్న వెంకటేష్ ఈ నోటీసు చూసి అవాక్కయ్యారు. ఈమేరకు శుక్రవారం ఆలయం వద్దనే సంఘనాయకులు వెంకటేష్,కార్యదర్శి హేమంత్‌లు హనుమాన్‌చాలీసా పఠిస్తూ నిరసన వ్యక్తం చేశారు.

పుంగనూరు డిపోచే తీర్థయాత్రలు

పుంగనూరు,నవంబరు 8 ప్రభాతవార్త : కార్తీకమాసంలో నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోనికి తీర్థయాత్రల సదుపాయాన్ని తీసుకువస్తున్నట్లు పుంగనూరు ఆర్టీసి డిపో మేనేజరు సుధాకరయ్య తెలిపారు. ఈనెల 17,24 తేదీలలో శ్రీశైలం, యాగంటి క్షేత్రాలకు ప్రత్యేక బస్సు ఏర్పాటుచేసినట్లు వివరించారు. 17,24 తేదీలలో ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు పుంగనూరు నుంచి బయలుదేరి శ్రీశైలం,యాగంటి క్షేత్రాలు దర్శించుకుని మరుసటి రోజు పుంగనూరు చేరుతుందన్నారు. ఈయాత్రకు పెద్దలకు రూ.1300, చిన్నపిల్లలకు రూ700 చార్జీలు నిర్ణయించామన్నారు. అలాగే కర్నాటకలో కోటిలింగాలు, బంగారు తిరుపతి, ముళబాగల్ ఆంజనేయస్వామి, కురుడుమలై క్షేత్రాలు దర్శించుకునేందుకు ఈనెల 18 మరియు 25 తేదీలలో ఒక్కరోజు యాత్ర నిర్వహిస్తున్నామని

బిఆర్‌డి ఆస్పత్రిలో ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం

– ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు

కుప్పం, నవంబర్ 8 ప్రభాతవార్త : కుప్పంలోని బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి లో ఈనెల 10వ తేది ఆదివారం ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం నిర్వహిస్తు న్నట్లు ఆస్పత్రి ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. బెంగళూరు నోవా ఐవిఎఫ్ డా॥ లావణ్య, ప్రముఖ గైనకాలజిస్ట్ డా॥ హరిత మండవ అధ్వర్యంలో సంతానం లేని దంపతులకు తగు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుం దన్నారు. ఈఅవకాశాన్నిసద్వినియోగం చేసుకోవాలని వివరాలకు 7729028405, 9398631629నెంబర్లను సం ప్రదించాలన్నారు.

కార్యకర్తల సంక్షేమంకు సిఎం చంద్రబాబు ప్రాధాన్యత

– మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్

కుప్పం, నవంబర్ 8 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానికి సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న సభ్యత్వ నమోదును ఆయన పరిశీలించారు. మున్సిపల్ పరిధిలో అత్యధికంగా సభ్యత్వ నమోదు చేసుకోవాలని కోరారు.స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఈనెల 12న మండల మీట్

కుప్పంరూరల్, నవంబర్ 8 ప్రభాతవార్త : కుప్పం మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 12వతేది ఉదయం 10.30గంటలకు కుప్పం మండల కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ సాయిలహరి తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల హెచ్‌ఒడిలు, ఎన్నికైన ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఘనంగా శ్రీ ఊరిగంగమ్మ ఆలయ కుంబాభిషేకం

శాంతిపురం, నవంబర్ 8 ప్రభాతవార్త : మండలంలోని బడుగుమాకులపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ ఊరిగ ంగమ్మ ఆలయ కుంబాభిషేక కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రాత:కాలార్చన, నాడీ సంధానం, వేద పారాయణం, హోమాలు నిర్వహించారు. అనంతరం మహాప్రాణప్రతిష్ట, మహాకుంబాభిషేక కార్యక్రమంను నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నేతలు నాగభూషణ ంరెడ్డి, ఎల్.జయరాంరెడ్డి, రాధాకృష్ణనాయుడు, జనార్దనరెడ్డి, విశ్వనాథ నాయుడు, ఉదయ్‌కుమార్‌తో పాటు సుమారు పన్నెండు గ్రామాల ప్రజలు హాజరయ్యారు.

సభ్యత్వ నమోదులో శాంతిపురం ఆదర్శంగా ఉండాలి

శాంతిపురం, నవంబర్ 8 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదుకార్యక్రమంలో శాంతిపురం మండలం ఆదర్శంగా నిలవాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం రాళ్ల బూదుగూరు గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెదేపాకు సభ్యత్వం ఉండాలని పార్టీ అంటే అందరిది అనే విధంగా సిఎం చంద్రబాబునాయుడు కార్యకర్తలకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. మంత్రి లోకేష్ పాదయాత్ర హామీలు సైతం అమలు చేస్తూ పార్టీ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నారన్నారు. నేతలు విశ్వనాథనాయుడు, జనార్దనరెడ్డి, ఉదయ్‌కుమార్, మణి, నాగరాజు, మంజునాథరెడ్డి, రమేష్, మునేగౌడు, దుబాయ్ గౌడు, రమేష్, చంద్ర, బసవరాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత డిఎస్సీ శిక్షణ స్క్రీనింగ్ టెస్ట్ వాయిదా

చిత్తూరు, నవంబర్ 8 ప్రభాతవార్త: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత డిఎస్సీ శిక్షణకు సంబంధించి ఈ నెల 10వ తేదీ నిర్వహించాల్సి స్క్రీనింగ్ టెస్టు వాయిదా వేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణ, ఉభయగోదావరి జిల్లాల్లో శాసమ మండలి ఎన్నికల ప్రకటన జారీ కావడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందన్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తా...డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

పాలసముద్రం, నవంబర్ 8 ప్రభాతవార్త: ఇసుక లోడ్ వేసుకుని వెళ్తున్న ట్రాక్టర్ శుక్రవారం మండల పరిధిలోని నరసింహాపురం అటవీ మార్గంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మధు(32)కు తీవ్రంగా గాయాలు అయ్యాయి. డ్రైవర్ ట్రాక్టర్ లోడ్ ఇసుకతో గంగమాంబపురం అటవీ మార్గంలో వెళ్తుండగా 20 అడుగుల లోయకు మధ్య రోడ్డులో వెళ్ళాల్సి వుండటంతో ట్రాక్టర్ ఒక్కసారిగా అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్ ఇంజన్ రెండు ముక్కలు అయ్యాయి. గాయపడిన డ్రైవర్ మధును చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

శక్తిస్వరూపిణీకి రాహుకాలాభిషేకం

బోయకొండ(చౌడేపల్లి), నవంబర్ 8 ప్రభాతవార్త : శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు శుక్రవారం రాహుకాలాభిషేకాన్ని నిర్వహించారు. ఉదాయాన్నే అమ్మవారికి అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో అభిషేకం, అలంకరణగా వించారు.ఇఒ, ఉపకమీషనర్ ఏకాంబరం, అర్చక, అధికార, సిబ్బంది సేవలందించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

చౌడేపల్లి, నవంబర్ 8 ప్రభాతవార్త : రోడ్డు భద్రతా నియమాలు పాటించి క్షేమంగా ఇళ్ళను చేరుకోవాలని పోలీసులన్నారు. పుంగనూరు రూరల్ సిఐ రాంభూపాల్ ఆదేశాల మేరకు చౌడేపల్లి-పలమనేరు ప్రధాన రహదారి శెట్టిపేట వద్ద వాహనాల తనిఖీలు చేసారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదనీ, అతివేగం అనర్థాలకు మూలమన్నారు. రోడ్డు భద్రతా నియమాలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వైష్ణవీదేవి ఆలయంలో విశేష పూజలు

చౌడేపల్లి, నవంబర్ 8 ప్రభాతవార్త : పుదిపట్లలో గల స్వయంభు వైష్ణవీదేవీ ఆలయంలో శుక్రవారం పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అర్చకురాలు శ్రావణి ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు జరిగాయి. ఆలయ నిర్మాణదాత వినోద్‌కుమార్‌రెడ్డి అమ్మవారి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

చలో మదనపల్లిని జయప్రదం చేయండి

సోమల, నవంబర్ 8 ప్రభాతవార్త: ఎస్సీ వర్గీకరణ రథసారథి మందకృష్ణ మాదిగ ఈనెల 14న మదనపల్లి వస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి మురళి తెలిపారు. సోమలలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ పుంగనూరు నియోజకవర్గ కోఆర్డినేటర్ శివయ్య మాదిగ మాట్లాడుతూ ప్రతి పల్లె నుంచి కనీసం వందమంది తక్కువ కాకుండా మదనపల్లి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మంద రామనాథం, మండల అధ్యక్షులు ప్రభు కుమార, ప్రకాష్ మాదిగ, రవికుమార్, సురేంద్ర, వెంకటరామయ్య, సకినాల శేఖర్ సుండు ముని తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ పై అవగాహన సదస్సు

యర్రావారి పాలెం, నవంబర్ 8 ప్రభాతవార్త : ఉదయ మాణిక్యం పంచాయతీ రెడ్డివారిపల్లిలో శుక్రవారం కోర్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌జి గ్రూప్ సభ్యులకు సిసి చంద్రకళ ఆధ్వర్యంలో ఎయిడ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి చికిత్సల గురించి కోర్ సంస్థ ప్రతినిధి తులసి వివరించారు ఎయిడ్స్ వ్యాధి అంటువ్యాధి కాదని పండించుకునే వ్యాధిని అన్నారు. ఈ కార్యక్రమంలో సిసి చంద్రకళ కోర్ ప్రతినిధి తులసి సంఘమిత్ర అంగన్వాడి కార్యకర్తలు గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

ఐదు మంది విఆర్‌ఓలతోనే ఎలా!

క్షేత్ర స్థాయిలో తీవ్రంగా రెవెన్యూ సిబ్బంది కొరత

పాలసముద్రం, నవంబర్ 8 ప్రభాతవార్త:

మండల పరిధిలో మొత్తం 13 రెవెన్యూ గ్రామాలు వుండగా ఇందులో విధులు నిర్వర్తించడానికి కేవలం 5 మంది విఆర్‌ఓలు మాత్రమే ప్రస్తుతం వున్నారు. మిగిలిన 8 రెవెన్యూ గ్రామాలకు విఆర్‌ఓలు లేకపోవడంతో ప్రజలు పలు ఇబ్బందులను ఎదుర్కొవాల్సి వస్తోంది. ప్రస్తుతం ఒకొక్క విఆర్‌ఓకు రెండేసీ గ్రామాలు ఇన్‌ఛార్జీగా నియమించినప్పటికీ మూడు రెవెన్యూ గ్రామాలు మిగిలి పోతున్నాయి. అంటే ముగ్గురు విఆర్‌ఓలకు మూడే గ్రామాలు అప్పగించి ఇద్దరు విఆర్‌ఓలు రెండేసీ గ్రామాలు ఇన్‌ఛార్జీలుగా నిర్వర్తించాల్సిన దుస్థితి ఏర్పడింది. క్షేత్ర స్థాయిలో ప్రజలకు ఏ ఒక్క సమస్య వచ్చినా అవసరం అయ్యే మొదటి వ్యక్తి విఆర్‌ఓ మాత్రమే. గ్రామ సచివాలయం వద్దకు ఏ సర్టిఫికేట్ కోసం వెళ్ళినా విఆర్‌ఓ తప్పనిసరిగా వుండాల్సి వుంటుంది. ఇకనైనా పాలసముద్రం మండలంలో అవసరమైన విఆర్‌ఓలను నియమించి విఆర్‌ఓల కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై వుంది.

గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

నేడు విద్యుత్ కోత

సూళ్లూరుపేట, నవంబర్ 8 ప్రభాతవార్త :

మన్నారుపోలూరు 220 కెవి సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఆ పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ కోత విధించనున్నట్లు విద్యుత్‌శాఖ డిఇ ఆర్.శేఖర్ శుక్రవారం తెలిపారు. సూళ్లూరుపేట పట్టణంలోని వట్రపాలెం, సూళ్లూరు, జిఎన్‌టి రోడ్డు, రైల్వేస్టేషన్ ఏరియా, సాయినగర్, మన్నారుపోలూరు ప్రాంతాల్లో విద్యుత్ కోత అమల్లో ఉంటుందని తెలిపారు.

ఎబివిపి ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు

నాయుడుపేట, నవంబర్ 8 ప్రభాతవార్త :

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో నాయుడుపేట పట్టణం లోని విక్రం జూనియర్ కళాశాలలో ఎబివిపి నూతన శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎబివిపి జిల్లా కన్వీనర్ సన్ని పాల్గొన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తడుకు చందు సైతం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద విద్యాసంఘం ఏదైనా ఉందంటే అది ఎబివిపి అన్నారు. తిరుపతి జిల్లా కన్వీనర్ సన్ని నాయకత్వంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శిగా విజయ్, సహాయ నగర కార్యదర్శిగా భరత్, వైస్‌ప్రెసిడెంట్‌గా మణిదీప్ అఖిల్, హాస్టల్ ఇన్‌ఛార్జ్‌గా సాయి, అజయ్, సోషల్ మీడియా ఇన్‌ఛార్జ్ సుధీర్ ఖేల్, కన్వీనర్‌గా భరత్, టౌన్ ఎగ్జిబిటెడ్ మెబర్‌గా నరసింహ మణికుమార్, ముని ప్రదీప్, ముని, నరేంద్ర, గణేష్, ముజీబ్‌లను ఎన్నుకున్నారు. ఎంపికైన నూతన నగర కార్యవర్గానికి, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. తిరుపతి జిల్లా ఎస్ఎఫ్‌డి కన్వీనర్ హరినారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై విచారణ

కోట, నవంబర్ 8 ప్రభాతవార్త :

కోట మండలం కొత్తపట్నం, కోట, జరుగుమల్లి గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లపై శుక్రవారం అధికారులు విచారణ చేపట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కోట మండలంలో ఆరుగురు ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. ఈ క్రమంలో ఆరుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు హైకోర్టును ఆశ్రయించారు. ఆ మేరకు వారిని విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఆదేశించడంతో వారు విధుల్లో కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లపై ఎంపిడిఓ వేణు, ఎపిడిఓ వరప్రసాద్, ఏపిఓ పూర్ణిమలు ఆయా గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లపై విచారణ చేపట్టారు. ఈ క్రమంలో సర్పంచుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉండగా, సర్పంచులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని కొత్తపట్నం సర్పంచ్ తిరుపాలయ్య ఆరోపించారు.

రైతులకు వ్యవసాయ సిబ్బంది సేవలందించాలి

వెంకటగిరి, నవంబర్ 9 ప్రభాతవార్త :

ఆధునిక వ్యవసాయ పద్ధతులలో విస్తరణ సిబ్బంది నైపుణ్యం కలిగి రైతులకు సేవాభావంతో సేవలు అందిచాలని తిరుపతి జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ట్రైనింగ్ కో ఆర్డినేటర్ భాస్కరయ్య కోరారు. వెంకటగిరి డివిజను పరిధిలోని వ్యవసాయ శాఖ సిబ్బంది శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాలానుగుణంగా మారుతున్న నూతన సాగు పద్ధతులు ఎప్పటికప్పుడు తెలుసుకుని రైతుల అభివృద్ధికి సలహాలు ఇవ్వాలని సిబ్బందికి ఆయన సూచించారు. సేంద్రియఎరువులు, పచ్చిరొట్ట, ప్రకృతి వ్యవసాయ పద్ధతులు నేల సారాన్ని కాపాడుతాయని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డా. శ్రీనివాసరెడ్డి వరి, నిమ్మ పంటలలో చేపట్టవలసిన చీడల యాజమాన్యం గురించి వివరించారు. రసాయనాల వాడకం వల్లన ఆహారం, పర్యావరణం కలుషితమవుతున్నాయని తెలిపారు. విస్తరణ సిబ్బందితో పాటు వ్యవసాయ అధికారులు శిరీష, మరియు భారతి పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు సాయి విద్యానికేతన్ విద్యార్థి

గూడూరు, నవంబర్ 8 ప్రభాతవార్త :

స్థానిక వెంకటేశ్వర స్వామి గుడి ప్రాంగణంలో ఉన్నటువంటి సాయి విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ పదవ తరగతి విద్యార్థి బాలాజీ అండర్ 17 విభాగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టీంకు ఎంపికయ్యారు. నవంబర్ 17వ తేదీ హర్యానా రాష్ట్రంలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఆంధ్రప్రదేశ్ టీం తరఫున పాల్గొనబోతున్నాడు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో పాఠశాల ఉపాధ్యాయులు మన్నూరు మల్లికార్జున మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం చదువు మాత్రమే కాకుండా అన్ని రంగాలలో ఓవర్ డెవలప్మెంట్ నినాదంతో సాయి విద్యానికేతన్ విద్యాసంస్థలు విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాయి. బాలాజీ కి పాఠశాల వైపు నుండి అన్ని సహాయ సహకారాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ...స్కూటరిస్ట్ దుర్మరణం

చిల్లకూరు, నవంబర్ 8 ప్రభాతవార్త :

మండలంలోని తిరుమల పాల్ డైరీ సమీపంలో జాతీయ రహదారిపై ఓజిలి మండలం పెద్దపరి గ్రామానికి చెందిన శ్రీరామ్ వెంకటరమణయ్య (48) శుక్రవారం బైక్ పై గూడూరు వస్తుండగా అదుపుతప్పి మరో స్కూటర్ నీ ఓవర్ టెక్ చేస్తు మరో స్కూటర్‌ని ఢీ కోనడంతో శ్రీరాం వెంకటరమణయ్య (48) వ్యక్తి మృతి చెందాడు. మరో ఇద్దరికి గాయాలు కావడంతో గూడూరు ప్రాంతీయ వైద్యశాలకి తరలించి చికిత్స అందిస్తున్నారు. అదే విధంగా మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. చిల్లకూరు ఎస్ఐ సురేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు!

నాయుడుపేట, నవంబరు 8 ప్రభాతవార్త;

నాయుడుపేట మండలంలోని పండ్లూరు సమీపంలో జాతీయరహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఓజిలికి చెందిన రవి,చెంచ్చు య్యలు మోటార్ సైకిల్‌పై నాయుడుపేటకు వెళ్ళి పనులు పూర్తి చేసుకొని తిరిగి స్వగ్రామమైన ఓజిలికి వస్తుండగా మార్గమధ్యలో పండ్లూరు జంక్షన్ వద్ద జాతీయ రహదారిని దాటుతున్న సమయంలో నెల్లూరు నుండి చెన్నైకి వెళుతున్న లారీని తప్పించబోయి ప్రమాదవశాత్తు మోటార్ సైకిల్ అదుపు తప్పి బోల్తాపడింది.దీంతో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న రవి, చెంచ్చయ్యలు తీవ్రంగా గాయపడ్డారు.స్థానికులు గుర్తించి క్షతగాత్రులను 108సహాయంతో చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరళించారు.

తెలుగు గంగ కాలువను పూడ్చి వారిపై చర్యలు

బాలాయపల్లి, నవంబర్ 8 ప్రభాతవార్త :

మండలంలోని పాపిరెడ్డి పల్లి గ్రామంలో తెలుగు గంగ కాలవను పూడ్చి ఇల్లును నిర్మించిన నాగేల్ల రాజమ్మ పై చర్యలు తీసుకుంటామని తాసిల్దార్ శ్రీనివాసులు తెలిపారు. పాపిరెడ్డిపాలెంలో తెలుగు గంగ కాలువలను పూడ్చి ఇల్లు నిర్మించిన ప్రదేశాన్ని తాసిల్దార్ రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. ఇల్లు తొలగించి కాలువ నిర్మించకపోతే క్రిమినల్ కేసు పెడతామని ఆయన హెచ్చరించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కూడా తెలుగు కాలువ స్థలంలో ఇల్లు నిర్మించిన ప్రదేశాన్ని పరిశీలించారు.

నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని : సిపిఎం

వెంకటగిరి, నవంబర్ 8 ప్రభాతవార్త :

నిత్యావసర సరుకులు ధరలు తగ్గించాలని ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సిపిఎం నియోజకవర్గ ఇన్చార్జి వడ్డిపల్లి చెంగయ్య తెలిపారు. శుక్ర

పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను కలిసినకిరణ్ యాదవ్

తిరుపతి హెల్త్, నవంబర్ 8 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టిడిపి అధ్యక్షులు, శాసనసభ్యులు పల్లా శ్రీనివాస్ యాదవ్‌ను బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు వీర కిరణ్ యాదవ్ మర్యాదపూర్వ కలిసి బీసీ సమస్యల గురించి, చర్చించి వినతి పత్రం అందజేశారు.

శివయ్య సేవలో టిటిడి బోర్డు సభ్యులు

శ్రీకాళహస్తి,నవంబర్ 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయం వాయులింగేశ్వరుని దర్శనానికి టిటిడి బోర్డు సభ్యుడు కోటేశ్వరరావు కుటుంబ సభ్యులతో రాగా దక్షిణ గోపురం వద్ద ఇఓ బాపిరెడ్డి ఆదేశాలతో పిఆర్ఓ రవి వేదపండితులతో స్వాగతం ఏర్పాటు చేసారు. స్వామి అమ్మవార్ల అంతరాలయం దర్శనం ఏర్పాటు చేసి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.స్వాగతం పలికిన వారిలో హరి,ప్రవీణ్, సుధాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మజిలి వ్యాపారులతో... స్థానిక వ్యాపారులకు ఇబ్బంది

శ్రీకాళహస్తి,నవంబర్ 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో పండగల సందర్భంగా మజిలి వ్యాపారులతో స్థానిక వ్యాపారులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ బి.గిరికుమార్‌కు వినతి పత్రం సమర్పించారు.శ్రీకాళహస్తిలోని టెక్స్‌టైల్స్, రెడిమేడ్ వర్తక సంఘం తమ వ్యాపారులకు ఇబ్బంది కల్గిస్తుంద న్నారు. నూతన సంక్రాంతి 2025 ఇతర పండగలకు ఇతర ప్రాంతాలకు సంబంధించిన వర్తకులు దిగుమతి అయి తమ వ్యాపారాలను దెబ్బతీస్తున్నారని నిత్యం తాము పన్నులు చెల్లించుకుంటూ వ్యాపారాలు సాగిస్తుంటే తాత్కాలిక దుకాణ దారులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కమిషనర్‌కు వివరించారు. ఫంక్షన్స్ హాల్స్,కళ్యాణమండపం,ప్లాట్‌ఫారంలో దుకాణాలు ఏర్పాటు చేసి తమ వ్యాపారాలను దెబ్బతీస్తున్నారని తమ ఆవేదనను కమిషనర్‌కు వివరించారు.

టిటిడి బోర్డు సభ్యురాలికి సత్కారం

శ్రీకాళహస్తి, నవంబర్ 8 ప్రభాతవార్త : మాజీ కేంద్రమంత్రి తిరుమల తిరుపతి బోర్డు సభ్యురాలు పనబాకలక్ష్మిని శుక్రవారం తిరుపతి పార్లమెంటు రైతు ఉపాధ్యక్షులు టి.ప్రకాష్‌నాయుడు, మరియు టిడిపి నాయకులు గోగినేని సురేష్‌నాయుడులు ఆమెను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో సత్కరించి శ్రీకాళహస్తీశ్వరస్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. తిరుమలేశుని దర్శనానికి వచ్చే భక్తులకు సకల సదుపాయాలు కల్పించాలని దళారుల బారినపడకుండా ఉండేలా చర్యలుతీసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శ్రీకాళహస్తి, నవంబర్ 8 ప్రభాతవార్త : నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఎస్‌పిడిసిఎల్ తిరుపతి రూరల్ డివిజన్ ఈఈ ఎన్.వాసురెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.నేడు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు శ్రీకాళహస్తి టౌన్, రూరల్, తొట్టంబేడు, బిఎన్‌కండ్రిగ, ఏర్పేడు, మరియు కెవిబిపురం మండలాల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కుంబాభిషేకంలో మాజీ చైర్మెన్

శ్రీకాళహస్తి,నవంబర్ 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ఏడుగంగమ్మల ఆలయ జీర్ణోద్ధారణ, కుంబాభిషేకం కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయ నిర్మాణానికి ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఉన్నపుడు అభివృద్ధికి, కొత్త ఆలయం నిర్మాణానికి రూ.40లక్షలు కేటాయించి పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తి అయి వచ్చేనెల 8న జరిగే ఏడుగంగమ్మల జాతరకు ముస్తాబు చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో శుక్రవారం కుంబాభిషేకం కార్యక్రమాల్లో మొదట తెలుగుదేశం నాయకులు హాజరు కాగా తరువాత భక్తి భావంతో మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరయ్యారు. మొదటి పూజలుగా అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్,గాజులు,పసుపు దారాలు అడబిడ్డ సారెగా అందించామని వివరించారు.

యుగాంతంలో ఉన్నాం...

దైవ ప్రార్థనలతో పునీతం కావాలి

శ్రీకాళహస్తి,నవంబర్ 8 ప్రభాతవార్త : దివ్యఖుర్‌ఆన్‌లో సూచించిన పలు సందేశాలను మహమ్మద్ ప్రవక్త సూచనల మేరకు మనం త్వరలోనే యుగాంతంకు సమీపంలో ఉన్నామని కాబట్టి దైవచింతనతో స్వర్గస్తులు కావాలని హాఫీజే ఖుర్ ఆన్ రేహాన్ సాహెబ్ అన్నారు. జమియా మస్‌జిద్‌లో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల తరువాత ఆయన మాట్లాడుతూ మనం సనాతన ధర్మాన్ని విస్మరించామన్నారు. మసీదులు ఖాళీగా ఉంటున్నాయన్నారు. మనం పునీతులు కావాలంటే క్రమశిక్షణతో ఏకాగ్రతతో అల్లాహ్ ప్రార్థనలు చేయాలని తాము చేసిన తప్పొప్పులను క్షమించమని దయాళువును వేడుకోవాలని అందుకు నిత్యం నమాజులు ఆచరించాలని సూచించారు. యుగాంతంలో సూచనలు నేడు అమలు జరుగుతున్నాయని వివరించారు. మనం ప్రార్థనలను మాని సెల్‌ఫోన్ల వీక్షణమీద దృష్టి సారించామని ఈ విధానం మానాలని ఆయన సూచించారు.

ప్రతి విద్యార్థులు చట్టాలపై... అవగాహన కలిగి ఉండాలి

తొట్టంబేడు, నవంబర్ 8 ప్రభాతవార్త : ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్‌నాయక్ తెలిపారు. న్యాయసేవ దినోత్సవం సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణంలోని ధర్మరాజులగుడి ఎదురుగా ఉన్న వసతిగృహంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్‌నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు తప్పకుండా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ముఖ్యంగా బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కలిగి ఉండాలనానరు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రతిఇంటికి హౌస్‌హోల్డ్ జియోట్యాగింగ్ : ఎంపిడిఓ

పెద్దవంజాణి, నవంబర్ 8 ప్రభాతవార్త : మండలంలో ప్రతి ఇంటికి హౌస్‌హోల్డ్ జియోట్యగింగ్ ఆన్‌లైన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ బాలాజీ పేర్కొన్నారు.శుక్రవారం మండలంలోని లింగాపురంలో జియోట్యగింగ్ ఆన్‌లైన్ కార్యక్రమాన్ని ఆయన నేరుగాపరిశీలించి అనంతరం సచివాలయాన్ని తనిఖీచేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతులకు యుడిఐడి కార్డులులేనిచో ఆధార్‌కార్డు,సదరన్ సర్టిఫికెట్,ఫోటో ఇతరవివరాలతో రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని సచివాలయ ఉద్యోగులు ఎక్కడికక్కడే నిర్వహిస్తున్నారని తెలిపారు.ఈ రిజిస్ట్రేషన్ అనంతరం వారికి యూడిఐడి కార్డును డౌన్లోడ్ చేసుకోవచ్చని ఎన్‌పిసిఐ ద్వారా ఆధార్‌కార్డు భ్యాంకుఅకౌంట్ వివరాలతో అనుసంధానంచేస్తూ లింక్ చేసుకోవాల్సిందిగా గ్రామస్థులకు సచివాలయ సిబ్బందికి సూచించారు.

పౌర సంబంధాలశాఖ మంత్రి మూడు రోజుల తిరుపతి జిల్లా పర్యటన

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 8 ప్రభాతవార్త : రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు కొలుసు పార్థసారథి ఈ నెల నవంబర్ 8వ తేదీ నుండి 10వ తేదీ వరకు మూడు రోజులు తిరుపతి జిల్లా పర్యటన నిమిత్తం విచ్చేయనున్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. 10వ తేదీ ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని మధ్యాహ్నం మూడు గంటలకు విజయవాడకు రోడ్డు మార్గాన తిరుగు ప్రయాణం కానున్నారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో నిందితులకు జరిమానా

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 8 ప్రభాతవార్త : ప్రజలు ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పకుండా పాటించాలి. అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ శ్రీ ఎల్. సుబ్బారాయుడు తెలిపారు. ఎస్పి సుబ్బరాయుడు ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీయస్పీ ఇన్చార్జి డియస్పి నర్సింగప్ప, ఇన్స్పెక్టర్లు సుబ్బారెడ్డి, సంజీవ్ కుమార్ వారు కేసుల వివరాలు వెల్లడించారు. తిరుపతి పట్టణ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపిన డ్రైవర్ల పై ట్రాఫిక్ పోలీసు వారు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను నమోదు చేసి 28 మంది ముద్దాయిలను 4 వ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు తిరుపతి నందు హాజరు పరచగా గౌరవ జడ్జి శ్రీ గ్రంధి శ్రీనివాస్ ఒక్కొక్కరికి 10వేలు చొప్పున మొత్తం 28 మందికి జరిమానా విధించారు.తిరుపతినగరప్రజలకుట్రాఫిక్‌సమస్యతలెత్తకుండబాధ్యతతోవిధులు నిర్వర్తించాలనిసూచించారు

కనులపండువగా అమ్మవారి ప్రాకారోత్సవం

శ్రీకాళహస్తి, నవంబర్ 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం దేవేరి జ్ఞానప్రసూనాంబికా అమ్మవారి ఉత్సవ మూర్తిని ఆలయంలోని అలంకార మండపంలో సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు నిర్వహించిన అనం తరం ఆలయం వెలుపలకు తీసుకువచ్చారు. ఆలయంలోనే గ్రామోత్స వాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ లోకేష్‌యాదవ్ పలువురు ఆలయాధికారులు పాల్గొన్నారు.

జవాబుదారీ తనంతో విధులు నిర్వహించండి

-చైర్ పర్సన్ ఆంజనేయ మూర్తి

తిరుపతి విద్య,నవంబర్ 8 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ వినియోగదారుల సమస్యల విద్యుత్ అధాలత్ తిరుపతి టౌన్ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చైర్‌పర్సన్ శ్రీనివాస్ ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యుల కె.రామ్మోహన్ రావ్,సాంకేతిక సభ్యులు అంజనీకుమార్ విచ్చేసారు. ఈ సందర్భంగా వినియోగదారులు వారు స్పందించి సమస్య పరిష్కారం చేస్తారు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో తిరుపతి టౌన్ డివిజన్ కార్య నిర్వాహ అధికారి విన్న కోటి చంద్ర శేఖర్ రావ్ తో పాటు టౌన్ డివిజన్ ఏ.డి.లు,ఏ.ఈ.లు టౌన్ డివిజన్ కార్యాలయ సిబ్బంది మరియు వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డివిఎస్ జన్మదిన వేడుకలు

తిరుపతి విద్య,నవంబర్ 8 ప్రభాతవార్త: స్థానిక న్యూ బాలాజీ కాలనీ లో ఉన్న ఎస్ డి హెచ్ ఆర్ విద్యా సంస్థల చైర్మన్ డివిఎస్ చక్రవర్తి రెడ్డి జన్మదిన వేడుకలు కళాశాల అధ్యాపకులు,సిబ్బంది,విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. చక్రవర్తి రెడ్డి జన్మదినంను పురస్కరించుకొని శుక్రవారం నగరంలోని రాజకీయ ప్రముఖులు, పలు విద్యాసంస్థల అధినేతలు,ఎస్ డి హెచ్ ఆర్ విద్యాసంస్థల అధ్యాపకులు, సిబ్బంది,విద్యార్థులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

15 వరకు తపాలా శాఖ ప్రత్యేక శిబిరాలు

పుత్తూరురూరల్, నవంబరు 8 ప్రభాతవార్త: రూరల్ రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ప్రతీ సచివాలయ పరిధిలో ఐపీపీబీ ఖాతాలు తెరిచేందుకు ఎన్‌పీసీఐ యాక్టివేషన్ కోసం ఈ నెల 15 తేదీ వరకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు పుత్తూరు సబ్ డివిజన్ తపాలా ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల ఫలాలను లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా జమ చేయనున్నదని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు రాష్ట్ర ప్రభుత్వ సామాజిక ప్రయోజనాలు పొందేందుకు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స ఫర్(డీబీటీ) లబ్ధిదారుల బ్యాంకు, తపాలా ఖాతాలకు తప్పని సరిగా ఎన్‌సీపీఐ లింక్ కలిగి ఉండాలన్నారు. దీని కోసం తపాలా కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

గణనాధునికి వెండి యజ్ఞోపవీతం బహూకరణ

కాణిపాకం, నవంబర్ 8 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారికి శుక్రవారం ఓ భక్తుడు వెండి యజ్ఞోపవీతంను విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన అరుణనాయుడు అనే భక్తుడు సుమారు 50 వేల రూపాయల వ్యయంతో 500 గ్రాముల వెండితో స్వామి వారికి ప్రత్యేకంగా తయారు చేయించిన యజ్ఞోపవీతంను విరాళంగా అందజేశారు. ఈ యజ్ఞోపవీతంను దాత కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్పెక్టర్ రవిలకు అందజేశారు. దాతలకు ఆయ సంప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ప్రారంభమైన తెలుగు భాష జాతీయ సదస్సు

తిరుపతి విద్య,నవంబర్ 8 ప్రభాతవార్త: భావనాప్రియ సాహితీ వేదిక ద్వారా జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ సహకారంతో శుక్రవారం తెలుగు భాషలో ఉన్నటువంటి ఔన్నత్యాన్ని తెలియజేయడం కొరకు మూడు రోజులపాటు జరుగునున్న తెలుగు భాషా జాతీయ సదస్సు ప్రారంభోత్సవం జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలోని చెలికాని అన్నారావు సభా భవనం నందు ప్రారంభించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భావన ప్రియ సాహితీ వేదిక అధ్యక్షులు డా.ఎన్.సి.హెచ్ చక్రవర్తి అతిథిగా డా.అల్లాడి మోహన్,విశిష్ట అతిథిగా విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ప్రొ.జి ఎస్సార్ కృష్ణమూర్తి తో కలిసి జ్యోతి ప్రజ్వానం చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రదేశాల నుండి 100కు పైగా రచయితలు,కవులు వచ్చి రచించిన కవిత్వాలను నాణీలను ఇతర సాహితీ ప్రక్రియలను చక్కగా వివరించడం జరిగింది.

బెల్ట్ షాపుల నిషేధంలో ప్రభుత్వం విఫలం

నగరి, నవంబరు 8 ప్రభాతవార్త: బెల్ట్‌షాపుల నిషేధంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి రోజా అన్నారు. మహిళలు బెల్ట్‌షాపు నిర్వాహకుని పట్టి ఇవ్వడంపై ఎక్స్ వేదికగా ఆమె స్పందించారు. హోంమంత్రి సొంతజిల్లా అనకాపల్లి మండలం తగరంపూడిలో బెల్ట్‌షాపులపై స్వచ్ఛందంగా మహిళలు తిరుగుబాటుచేసి పోలీసులకు పట్టివ్వడమే ఇందుకు సాక్ష్యమన్నారు. పోలీసులు బెల్ట్‌షాపు నిర్వాహకుడి నుంచి 121 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారన్నారు. రాష్ట్రంలో బెల్ట్‌షాపులు ఎక్కడా లేవని చెప్పిన హోంమంత్రి ఇప్పుడు ఏం సమాధానం చెబుతారన్నారని ప్రశ్నించారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే ఐదు లక్షల జరిమానా విధిస్తామన్న సీఎం చంద్రబాబు ఎందుకు స్పందించడం లేదన్నారు. బెల్ట్‌షాపుల నిషేధంపై ప్రభుత్వం విఫలమైందన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం

నగరి, నవంబరు 8 ప్రభాతవార్త: పట్టణ పరిధి కరకంఠేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న స్కంధషష్టి వేడుకల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వైద్యసేవలు

నగరి, నవంబరు 8 ప్రభాతవార్త: అడిషనల్ సివిల్ జడ్జి వి.గోపాలకృష్ణ ఉత్తర్వుల మేరకు స్థానిక సిరీడ్స్ దివ్యాంగుల పాఠశాలలోని విద్యార్థులకు స్థానిక ఏరియా ఆస్పత్రి సిబ్బంది పాఠశాలలోనే వైద్య సేవలు అందించారు. శుక్రవారం పాఠశాలకు వెళ్లిన వారు అక్కడున్న దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.ఏరియా ఆస్పత్రి వైద్యులు, పాఠశాల నిర్వాహకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు పుత్తూరులో విద్యుత్‌కు అంతరాయం

పుత్తూరు, నవంబరు 8 ప్రభాతవార్త : సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శనివారం పుత్తూరు మునిసిపాలిటీ, రూరల్ మండలంలో కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఎఇ సాయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 వరకూ విద్యుత్ సరఫరా వుండదని, ప్రజలు దీనికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

లా కళాశాల పై చర్యలు తీసుకోండి

తిరుపతి విద్య,నవంబర్ 8 ప్రభాతవార్త: శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో యూత్ ఫెస్టివల్ ముఖ్య అతిథిగా వచ్చిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌కి జాతీయ న్యాయ విద్యార్థుల సంఘం (ఎన్ఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. మంత్రి ఈ విషయం గురించి స్పందిస్తూ ఫీజు దోపిడి చేసేటువంటి లా ప్రైవేటు కళాశాలలో చర్యలు తీసుకునేలాగా అలాగే ఎస్వీ యూనివర్సిటీలో మూడు సంవత్సరాల లా కోర్సును ఏర్పాటును రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని స్పష్టమైన హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రెడ్డి మోహన్.ఓ.బి సి సంఘం ఎస్వీ యూనివర్సిటీ అధ్యక్షులు తిరుమలేష్,బి.సి.జె ఎ సి స్టూడెంట్ యూనియన్ రాయలసీమ ఇన్చార్జి ఉత్తరాది విజయ్,యోగేష్,ముఖేష్ తదితర నాయకులు పాల్గొన్నారు

విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ

పాకాల, నవంబర్ 8 ప్రభాతవార్త : పాకాల మండలం నందు జింకలమిట్ట వద్ద ఉన్న స్నామ్ అలాయిస్ ఫ్యాక్టరీ వారు పచ్చిపాల పల్లి ప్రాథమిక పాఠశాలలో చదివే సుమారు20 మంది విద్యార్థులకు పలకలు, నోట్ బుక్స్,పెన్నాలు, పెన్సిల్స్,రాత అట్టలు మొదలైన విద్యా సామాగ్రిని పంపిణి అందచేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యా శాఖాధికారి బాబ్జి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ దాతలు ఇచ్చిన విద్యా సామాగ్రిని ఉపయోగించుకొని బాగా చదువు కోవాలని అన్నారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ ప్రతినిధులు హరిగణేషన్, గణనాధన్, సాయి కృష్ణ, రావుఫ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషాద్రి, ఉపాధ్యాయులు కేశవ రావు, సి.ఆర్.పి శ్రీనివాసులు, అంగన్వాడీ కార్యకర్త సరళ పాల్గొన్నారు.

భక్తుల భాగస్వామ్యంతో గ్రామోత్సవం

శ్రీకాళహస్తి,నవంబర్ 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం సందర్భంగా పెళ్ళకూరు మండలం చెంబేడు వాస్తవ్యులు ఆబాక రంగనాయకమ్మ కుటుంబం ఉభయదారులుగా శుక్రవారం స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవంతో పాటు ఉభయదారులు రంగనాయకమ్మ దంపతులు, ఆలయ ఇన్స్పెక్టర్ హరియాదవ్, దఫేదార్ రాజా పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల నృత్యప్రదర్శనలు

శ్రీకాళహస్తి,నవంబర్ 8 ప్రభాతవార్త : కార్తీక మాసం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం విజయవాడ విశ్వనాథ్ అకాడమికి చెందిన 14 మంది కళాకారులు ప్రదర్శించిన నృత్యప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి.

తిరుపతి డివిజన్

బ్యాంక్ ఖాతాకు ఆధార్ అనుసంధానం తప్పని సరి

పుత్తూరు, నవంబరు 8 ప్రభాతవార్త : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ సంక్షేమ పథకాలు అందుకుంటున్న లబ్దిదారులు తమ బ్యాంక్ ఖాతాకు సంబంధించి నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు తమ ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని కమిషనర్ ఎం.మంజునాథ్ గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ అనుసంధానం కాకపోతే సంక్షేమ పథకాల ద్వారా వచ్చే సబ్సిడీ సొమ్ము లబ్దిదారుల ఖాతాల్లో జమ కాదని తెలిపారు. అందువల్ల సంక్షేమ పథకాలు లబ్దిని కొనసాగించేందకు తప్పనిసరిగా ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని స్పష్టం చేశారు.

ఉచిత హెల్త్ కేర్ సెంటరును ప్రారంభించిన ఎమ్మెల్యే

పాకాల, నవంబర్ 8 ప్రభాతవార్త : పాకాల మండలం దామలచెరువు పంచాయతీ పత్తిపాటివారిపల్లిలో మహాప్రస్థానా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ కేర్ సెంటర్, ఉచిత భోజనశాల, రిహాబిలిటేషన్ సెంటర్‌కు భూమి చేసి శుక్రవారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు. దామలచెరువు పంచాయతీ ఊటువంక గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రజల ఇబ్బంది గమనించిన నాని యుద్ధ ప్రాతిపదికన గ్రావెల్, సి సి రోడ్డు నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.అధికారులు ఎన్ డి ఏ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు,పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

సత్యవేడు, నవంబరు 8 ప్రభాతవార్త: డిజిటల్ నెట్‌వర్కింగ్ చోటు చేసుకుంటున్న మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తిరుపతి సైబర్ క్రైమ్ అధికారి నరసింహారావు స్పష్టం చేశారు. శుక్రవారం జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు సత్యవేడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మురళీనాయుడు అధ్యక్షతన సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ అధికారి నరసింహారావు మాట్లాడుతూ ప్రస్తుతం ఇంటర్నెట్ జీవితంలోని అన్ని అంశాలను తాకుతుందన్నారు. అదే సమయంలో శక్తివంతమైన సైబర్ దాడులు పెరిగిపోవడం ఆందోళనకరమన్నారు. 1930 టోల్ ఫ్రీ నెంబర్ కూడా కాల్ చేసి సమాచారాన్ని అందిస్తే సమీప పోలీసులు సంఘటనా స్థలానికి వెంటనే వాలిపోతారన్నారు. ఆకతాయిలు మహిళలు వెంట పడ్డ మనోధైర్యాన్ని కోల్పోకుండా పోలీసులకు తెలియజేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ అవగాహన సదస్సులో సత్యవేడు, వరదయ్య పాళెం, నాగలాపురం ఎస్ఐలు రామస్వామి, మల్లికార్జున్, సునీల్, బాలికల గురుకుల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వసుందర, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, పలువురు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి స్కంధ షష్టి ఉత్సవాలు

పుత్తూరురూరల్, నవంబరు 8 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని శ్రీ వల్లిదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి స్కంధ షష్టి ఉత్సవాలు శుక్రవారంతో ముగిసింది. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉభయదాతగా రాచపాళెం గ్రామానికి చెందిన పుత్తూరు సంధ్య వైద్యులు ఎస్.ప్రకాష్‌రాజు, జుగల్ కిషోర్‌లు వ్యవహరించారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు విశేష హోమాలు ప్రత్యేక పూజలు చేసి అనంతరం వైభవంగా శ్రీవ

వైభవంగా ఏడు గంగమ్మల ఆలయ కుంబాభిషేకం

శ్రీకాళహస్తి,నవంబర్ 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మగుడివీధిలో వవెలసిన ఏడు గంగమ్మల ఆలయ కుంబాభిషేకం కన్నుల పండువగా శుక్రవారం నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించిన పూజలు, హోమాలు,కలశ స్థాపనక కోసం ఏర్పాటు చేసిన కలశాలను ఉద్వాసన గావించారు. ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి సారథ్యంలో కుంబాభిషేకం కార్యక్రమాలకు బొజ్జల రిషితారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయం తరఫున చిన్న ఆలయాలకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వటానికి శాసనసభ్యులు సుధీర్‌రెడ్డి ఆదేశించారన్నారు. నేడు ఏడుగంగమ్మల ఆలయాన్ని ఆధునీకరించి కుంబాభిషేకం నిర్వహించటం అభినందనీయం అన్నారు. ఆమెకు ఆలయం తరఫున ఇఓ టి.బాపిరెడ్డి, ఇఇ మురళీధర్‌రెడ్డి, డిఇఇ శ్రీనివాసులురెడ్డి, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, ఆలయ ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, వేదపండితులు అర్ధగిరి, మారుతీశర్మల సారథ్యంలో స్వాగతం పలికారు. కలశాల అభిషేకం తరువాత ఆలయంలో మూల విరాట్టుకు అభిషేకించారు. తీర్థ ప్రసాదాలను రిషితారెడ్డికి అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్ సారథ్యంలో కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులు స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో కంఠా రమేష్, మైనారిటి ముస్లిం నాయకులు ఖాదర్‌బాషా,షాకిర్ అలి,అమీన్,వాకచర్ల గుర్రప్పశెట్టి, కాసరం రమేష్,,డివి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాతకాల్వలో... పోలీసు బందోబస్త్ మధ్య భూ సర్వే

తిరుపతిరూరల్, నవంబర్ 8 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలం పాతకాల్వ గ్రామ పంచాయతీలో శుక్రవారం పోలీసు బందోబస్త్ మధ్య మండల సర్వేయర్ ఓ ప్రవేట్ భూమిని సర్వే చేసారు. ఒక సర్వే నెంబర్‌కు చెందిన భూ సరిహద్దులను వేరొక సర్వే హద్దులతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కానీ భూ రికార్డులలో మాత్రం సర్వేనెంబర్ ఒకటి, సరిహద్దులు వేరేవారి భూమికి చెందిన హద్దులను వ్రాసుకున్నారు. సరిహద్దులు తప్పులు వ్రాసుకున్న వ్యక్తులు అధికార దర్పాన్ని ప్రదర్శిస్తూ...పెద్ద స్థాయిలో అధికారులపై ఒత్తిడి చెచ్చి...ఎలాగైన తప్పుడు సరిహద్దులతో రిజిస్ట్రర్ చేసుకున్న భూమిని కైవసం చేసుకోవాలని సకల ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈ భూమి సరిహద్దుల విషయంలో కేసు నమోదు కావడంతో తిరుపతిరూరల్ సి.ఐ. చిన్నగొవిందుడు ఆధ్వర్యంలో మండల సర్వేయర్ హేమకుమార్ సర్వే చేసారు. సర్వే చేసి సరిహద్దులతో పాటు ఫలాన సర్వేనెంబర్ భూమి, దీనికి సంబంధించి సరిహద్దులు ఇవి అని తెల్చి చెప్పారు. కానీ మండల సర్వేయర్ సర్వే కాదని, డి.ఐ సర్వే చేయాలని కోరినట్లు సమాచారం. తిరుపతిరూరల్ మండలం పాతకాల్వ గ్రామ పంచాయతీలో భూ హద్దులు మార్చి వెరొకరి భూమిలోకి ప్రవేశించి, ఆక్రమణకు ప్రయత్నించడంతో ఇండ్ల స్థలాలు కొనుగోలు చేసిన లబ్దిదారులు లబోదిబో మంటున్నారు. పేరూరు గ్రామ లెక్కదాఖల సర్వేనెంబర్ 197/2లో వున్న 99 సెంట్ల భూమిలో గత 10సంవత్సరాల ముందు రామచంద్రారెడ్డి అనే వ్యక్తి లే అవుట్ వేసి విక్రయించాడని బాధితులు తెలిపారు. 197/1లో వున్న 99 సెంట్లలో వున్న భూమిలో 192/2 సరిహద్దులు నమోదు చేసి కొనుగోలు చేసిన ఓ మహిళ కొనుగోలు చేసారు. ఎలాగైన ఆభూమిని కైవసం చేసుకోవాలని చూస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఈ భూ వివాదంపై తిరుపతిరూరల్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు కావడంతో పోలీసుల సమక్షంలో మండల సర్వేయర్ సర్వే చేసారు. రెవెన్యూ రికార్డులలో నెలకున్న సర్వేనెంబర్, సరిహద్దుల మేరకు సర్వే చేసి, రిపోర్టు అందజేసినట్లు సమాచారం. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

శ్రీవేంకటేశ్వర ఆలయ నిర్మాణానికి భూమి పూజ

సూళ్లూరుపేట, నవంబర్ 8 ప్రభాతవార్త : సూళ్లూరుపేట మండలం తూర్పుపల్లెల్లోని తోటకట్ల గ్రామంలో శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానం నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొక్కు శంకరయ్య యాదవ్ ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమాన్ని సాంప్రదాయబద్ధంగా వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాకం వెంకటసుబ్బయ్య, ఎం.తిరుపాల్, బి.వెంకటేష్, కట్టా సుధాకర్, నాగరాజు, చలివేంద్ర రవి, కె.బాలకృష్ణ, సిహెచ్ వెంకటేష్, జానకిరామయ్య, ప్రభాకర్, హేమకుమార్, వెంకటేష్, ప్రదీప్, నవీన్, మురళీకృష్ణలు పాల్గొన్నారు.

దేవాదాయ భూములు పరిశీలన

సూళ్లూరుపేట, నవంబర్ 8 ప్రభాతవార్త : సూళ్లూరుపేట మండలం తోటకట్ల గ్రామంలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి ఉన్న పంట పొలాలకు వేలంపాటలు నిర్వహించేందుకు టిటిడి వారి ఆధ్వర్యంలో శుక్రవారం పరిశీలి ంచారు. గ్రామస్థులు ఈ వేలంపాటలను ఆపాలంటూ కోరారు. రెండు లక్షల నుంచి రెండున్నర లక్షల వరకు పొలాలు విలువ ఉండటంతో గ్రామస్థులు అర్చకులుగా పద్మనాభశర్మను నియమించుకున్నారు. దీంతో టిటిడి నుంచి వచ్చిన అధికారి దేవాలయ అర్చకులు ద్వారా పూర్తి బాధ్యతలు నిర్వర్తించుకోవచ్చని తెలిపారు.

సూళ్లూరుపేట సాగునీటి అవసరాలు తీర్చండి

- ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట, నవంబర్ 8 ప్రభాతవార్త : సూళ్లూరుపేట నియోజకవర్గం పరిధిలోని సాగునీటికి సంబంధించిన అవసరాలు తీర్చాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సాగునీటి బోర్డు సలహా కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. రాంభట్లపల్లి ఎస్కేప్ ఛానల్ నుంచి స్వర్ణముఖి నదికి రెండు టిఎంసిల నీటిని అందించాలని తెలిపారు. కలవకూరు డ్యామ్ నుంచి బిపిఎస్ ఛానల్ లైనింగ్ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌ను ఆదేశించాలని కోరారు. ప్రస్తుతం బిపిఎస్ కెనాల్‌లో తుంగ, గడ్డి ఎక్కువగా ఉండటం వలన సాగునీరు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, పూడిక తీత ద్వారా తొలగించాలని కోరారు. ఈ విషయాలన్నింటినీ జిల్లా సాగునీటి సంఘ సలహాబోర్డు పరిగణనలోకి తీసుకొని సూళ్లూరుపేట ప్రాంత రైతుల సాగునీటి అవసరాలు తీర్చాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ, కోవూరు, సర్వేపల్లి, కావలి, వెంకటగిరి ఎమ్మెల్యేలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, డివి కృష్ణారెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, ఎంఎల్‌సి బల్లి కల్యాణ చక్రవర్తి, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఇరిగేషన్ అధికారులు, రైతు సలహాసంఘ నాయకులు పాల్గొన్నారు.

నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో నేషనల్ లెవెల్ ప్రాజెక్ట్ ఎక్స్పో

గూడూరు, నవంబర్ 8 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని ధూర్జటి నగర్ ప్రాంతంలో ఏర్పాటై యున్న నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నేషనల్ లెవెల్ ప్రాజెక్ట్ ఎక్స్పో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్ట్ నమూనాలను నారాయణ కళాశాలల డైరెక్టర్ దత్తాత్రేయ శర్మ,ప్రిన్సిపల్ రవి ప్రసాద్ నాయుడుతో కలిసి పరిశీలించి, వాటి ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఈ ప్రాజెక్టు నమూనాలను చూసేందుకు పట్టణంలోని బాలాజీ, స్వర్ణాంధ్ర భారతి, డి ఆర్ డబ్ల్యు, కళాశాల నుండి విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను కేవలం క్లాస్ రూములకే పరిమితం చేయకుండా, వారిని కొత్త పరిజ్ఞానం రూపొందించడంలో ప్రోత్సహించడం జరుగుతుందని, ఈ ఎక్స్పోలో విద్యార్థులు రూపొందించిన అనేక రకాల నమూనాలకు కావలసిన గైడెన్స్ ను కళాశాల తరఫున అందించడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీన్ విశ్వక్ సేనారెడ్డి, ప్రాజెక్ట్ కన్వీనర్ నీరజరెడ్డి, ఏవో కొండారెడ్డిలు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతే సీఎం లక్ష్యం : ఎమ్మెల్యే

బాలాయపల్లి నవంబర్ 8 ప్రభాతవార్త: రైతుల అభ్యున్నతే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని వెంకటగిరి, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, నెలవల విజయశ్రీ తెలిపారు. మండలంలో ఊట్లపల్లి గ్రామం వద్ద తెలుగు గంగ ఐదవ బ్రాంచ్ కాలం నుండి చెరువులకు ఎమ్మెల్యేలు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కండలేరు, సోమశిల డ్యామ్ లో నీరు పుష్కలంగా ఉన్నాయని ఎమ్మెల్యే రామకృష్ణ తెలిపారు. 60 టీఎంసీల నీరు నిల్వ ఉందని చెప్పారు. రైతులకు పుష్కలంగా నీరు అందిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ మాట్లాడుతూ సులూరుపేట నియోజకవర్గం లోని 26చెరువులకు ఐదో బ్రాంచ్ కాలం నుండి నీటిని అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ రాజేశ్వరరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాజశ్వరరావు మండల పార్టీ అధ్యక్షుడు చంద్రమోళి రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి మృతి!

గుడుపల్లి, నవంబరు 8 ప్రభాతవార్త : మండలంలోని కోడిగానిపల్లి గ్రామంలో అడవి పందుల దాడులు నివారించేందకు ఓవ్యక్తి తన పొలాల వద్ద అక్రమంగా విధ్యుత్ తీగలు లాగిఉంచగా ఆ విద్యుత్ తీగలు తగిలి ఓ వ్యక్తి మృతి చెందినట్లు తెలిసింది. అయితే ఈవిషయం వెలుగు చూడకుండా సదరు పొలం యజమాని మృతిచెందిన వ్యక్తి మృతదేహాన్ని ఎవరికి తెలియకుండా పూడ్చిపెట్టినవైనం శుక్రవారం వెలుగు చూసింది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికుల కథనం మేరకు వివరాలిలా... కర్నాటక రాష్ట్రందోనిమడుగు గ్రామానికి చెందిన శరవణ (45) గుడుపల్లి మండలంలోని కోడిగానిపల్లి గ్రామంలోని మహిళతో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు అయితే గత సోమవారం అత్తగారింటికి వచ్చిన శరవణ తన మరదలితో అక్రమ సంబంధం ఉండడంతో రాత్రి కోడిగానిపల్లి సమిపంలోని పోలాలకు వెళ్ళడంతో అక్కడ రామక్రిష్ణ అనే రైతు పొలంలో అక్రమంగా అడవి పందుల నివారణకు లాగిన విద్యుత్ తీగలు తగలడంతో అతన్ని అక్కడే వదిలి, ఆమే వచ్చేసింది, దీంతో అతను మృతి చెందగా శుక్రవారం అతని భార్య గ్రామంలోకి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేస్తానని అనడంతో రామక్రిష్ణ గుడుపల్లి పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. కాగా శనివారం పోలీసులు శరవణ మృతదేహాన్ని వెలికితీయనున్నట్లు తెలిసింది.

వెలుపల క్యూలైన్లలో...చలికి అసౌకర్యం లేకుండా చర్యలు

-భక్తులకు వేడిపాలు అందించాలి-ఆకస్మిక తనిఖీల్లో అదనపు ఈఓ చౌదరి

తిరుమల,నవంబర్ 8 ప్రభాతవార్తప్రతినిధి: భక్తుల రద్దీకి తోడు వర్షం కురిసి, చలిగాలులు వీస్తుండటంతో వెలుపల క్యూలైన్లలో భక్తుల సౌకర్యాలపై శుక్రవారం వేకువజామున అదనపు ఈఓచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆకస్మిక తనిఖీలు చేశారు. వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లతో బాటు వెలుపల క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షిస్తున్న చలికి వణుకుతున్న భక్తులకు సౌకర్యాలు పై ఆరా తీశారు. చలిలో ఉంటున్న భక్తులకు నిరంతరాయంగా వేడి పాలు అందించాలని, వైద్యసదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

మండల సర్వసభ్య సమావేశంలో ప్రోటోకాల్ రగడ!

సోమల, నవంబర్ 8 ప్రభాతవార్త : సోమల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశం వాడి వేడిగా జరిగింది. తొలుత ఎంపీపీ ఈశ్వరయ్య సభను ప్రారంభిస్తూ అధికారులు ప్రోటోకాల్‌పాటించలేదని ధ్వజమెత్తారు. మండల అభివృద్ధి గూర్చి సర్పంచులకు, ఎంపీటీసీలకు, ఎంపీపీ, జడ్పిటిసి లకు కనీస సమాచారం కూడా ఇవ్వలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ ప్రభాకర్ మాట్లాడుతూ పరిస్థితులు ఇలాగే కొనసాగితే తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. సోమల ఎంపీటీసీ సావిత్రమ్మ మాట్లాడుతూ సోమల బస్టాండ్ లో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని బస్టాండ్ లో తోపుడు బళ్ళు పెట్టడంతో బస్సులు కూడా వచ్చే వీలు లేకుండా పోతుందని అన్నారు. పుంగనూరు, తిరుపతి, సోమల పెద్దప్పరపల్లి మార్గంలో నడిరోడ్లపైనే ఆటోలు నిలబెట్టడం వల్ల ట్రాఫిక్కు అంతరాయం కలుగుతుందని పోలీసు అధికారులు పరిష్కరించాలంటూ సూచించారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో మంచినీటి సమస్య అధికంగా ఉందని వాటిని పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు అధికారులకు సూచించారు. ప్రజా ప్రతినిధులు సమస్యలు తెలిపినచోట వెంటనే పరిష్కరిస్తామని ట్రాన్స్‌కో ఏఇ మహేందర్‌రెడ్డి అన్నారు. ఉపాధి హామీ భవనం పక్కన టాయిలెట్లు అసంపూర్తిగా ఉండడంతో సచివాలయ సిబ్బంది, ఉపాధి సిబ్బంది సమస్యలు ఎదుర్కొంటున్నారని అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నారాయణ, వైస్ ఎంపీపీ సైద్ బాషా, కో ఆప్షన్ సభ్యుడు మస్తాన్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

జాయింట్ వీల్ నుంచి పడి మృతి చెందిన గౌతమి

కేవీబీ పురం, నవంబరు 8 ప్రభాతవార్త: కేవీబీ పురం మండలం పెరిందేశం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ టీడీపీ కార్యకర్త భాస్కర్ కుమార్తె ఎన్.గౌతమి (18) తిరుపతి తిరుచానూరులోని శిల్పారామంలో జరిగిన సంఘటనలో తీవ్రంగా గాయపడి తిరుపతిలోని మారుతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. నవంబరు 3న తిరుచానూరులోని శిల్పారామంలోని ఎగ్జిబిషన్‌లో జాయింట్ వీల్ 35 అడుగుల ఎత్తు నుంచి ఊడి పడింది. దీంతో జాయింట్ వీల్‌లో ఉన్న గౌతమి కొనప్రాణాలతో కొట్టుమిట్టాడుతుండడంతో తిరుపతిలోని శ్రీ మారుపతి సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆ చికిత్స కోసం ఎక్కువ ఖర్చవుతుందనడంతో వైద్యులు గౌతమి కుటుంబం పేద వారు కావడంతో మారుతి ఆస్పత్రి నుంచి ఎస్‌వీఆర్‌ఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి 10 గంటలకు మృతి చెందినట్టు తెలిపారు. ఆమె మరణం కుటుంబ సభ్యులకు తీరని లోటు అని కేవీబీ పురం టీడీపీ నాయకులు తెలిపారు. గౌతమికుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. అలాగే సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పేరిందేశం గ్రామానికి చేరుకుని టీడీపీ కార్యకర్త భాస్కర్ కుమార్తె గౌతమి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబానికి ధైర్యం చెప్పి తక్షణ సహాయంగా 55 వేలు చెక్కును అందించి, కలెక్టర్‌తో మాట్లాడి ప్రభుత్వం తరపున సహాయం అందించాలని కోరారు.

పెరుమాళ్ళపల్లి రైతు శిక్షణ కార్యక్రమం

తిరుపతి హెల్త్, నవంబర్ 8 ప్రభాతవార్త : తిరుపతి వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో శుక్రవారం రైతు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమంలో చెరకులో మేలైన యాజమాన్యం, బెల్లం తయారీలో మెలకువలు అనే అంశంపై రైతులకు శాస్త్రవేత్తలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎస్సీ ఉప ప్రణాళిక పథకంలో భాగంగా పెరుమాళ్ళపల్లె వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ ఎన్వీ సరళ అధ్యక్షతన జరిగిన రైతు శిక్షణా కార్యక్రమం ప్రారంభోత్సవ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడిఆర్ డాక్టర్ వి. సుమతి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ చెరుకు సాగు విస్తీర్ణం తగ్గడానికి గల కారణాలు, రైతులు చెరుకు సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు, వాటి ఫలితాల గురించి ఆమె వివరించారు. పెరుమాళ్ళపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో లభించే చెరుకు రకాలు, వాటి దిగుబడి వివరాలు గురించి శాస్త్రవేత్త కే.ఆర్. ఠాగూర్, శిక్షణలో భాగంగా రైతులకు పరిశోధన స్థానంలో అందుబాటులో ఉన్న వివిధ చెరుకు రకాల గురించి క్షేత్ర పర్యటన చేశారు. సమావేశంలో శాస్త్రవేత్త డాక్టర్ వజంత బెల్లం తయారీ మెలకువలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో చెరుకు సాగులో ప్రధానంగా రైతులు ఎదుర్కొంటున్న చీడపీడలు, విత్తన శుద్ధి ప్రాముఖ్యత, జీవన ఎరువుల ఆవశ్యకత, జీవన ఎరువుల వినియోగంతో కలిగే ప్రయోజనాలు గురించి రైతులకు స్పష్టంగా తెలియజేశారు. చెరుకు విత్తన ఉత్పత్తి గురించి రైతులకు తెలియజేసి దానివల్ల రైతులు ఆదాయం ఆర్జించవచ్చని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో చిరు ధాన్యాల పంటల సాగు, ఆదాయ, వ్యయాలు, ఆరోగ్యపరమైన లాభాలు గురించి శాస్త్రవేత్త డాక్టర్ శ్రీవల్లిదేవి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఎస్సీవీ దిలీప్ పుట్టినరోజు వేడుకలు

శ్రీకాళహస్తి, నవంబర్ 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీనాయుడు తనయుడు టిడిపి పార్టీ యువ నాయుడు ఎస్సీవీ దిలీప్ నాయుడు పుట్టినరోజు సందర్భంగా ఆయన స్వగృహంలో అభిమా నులు, టిడిపి నాయకులు, కార్యకర్తల నడుమ అంగరంగ వైభంగా నిర్వహించారు. భారీకేక్‌ను కట్‌చేసి ఎస్సీవీ దిలీప్‌కు శుభాకాంక్షలు తెలిపారు. టిఎన్ఎస్ఎఫ్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు, యస్‌సివి యువత నాయకుడు చిట్టివేలు సుకుమార్ రాయల్ మిత్రబృందం ఆధ్వర్యంలో భారీకేక్ కట్‌చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బాణాసంచాపేల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం పలువురు అభిమానులు ఎస్సీవీ దిలీప్‌ను దుశ్శాలువ, పూలమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యువనాయకులు యస్‌సివి కిరణ్ నాయుడు, గాలి బాలాజీనాయుడు, హరిబాబునాయడు, నారాయణయాదవ్, ప్రసాద్ నాయుడు, ప్రభాకర్‌నాయుడు, సుదర్శన్‌నాయుడు, జానకిరాం నాయుడు, వినయ్ కుమార్, రఘురాం, మధు, అంజూరు రఘురాం, పామంజి సుబ్రమణ్యం, దిలీప్, రవి, కె.రాజనాయుడు, గుణకాల ఉదయ్, మోహన్, వెంకీ , చంద్ర, కుమార్, భరత్, మురళీ, పెంచలయ్య, షణ్ముగం, దొరబాబు, సురేష్, రవి, మస్తాన్, కొండయ్య, డిల్లీప్రతాప్, కయ్యూరిశివ, బాబు తదితరులు పాల్గొన్నారు.

పొన్నాలమ్మకి వెండిబిందే బహూకరణ

శ్రీకాళహస్తి రూరల్,నవంబర్ 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తిలోని పానగల్‌లో వెలసిన పొన్నాల మ్మతల్లి గ్రామ దేవతకు ఏర్పేడు మండలం అంజిమేడు గ్రామానికి చెందిన కందాటి రాధిక, కందాటి లావిత్‌లు వెండి బిందెను బహూకరించారు. పొన్నాలమ్మ తల్లి ఆలయంలో మొక్కును తీర్చుకొనుటకు అమ్మవారికి నిత్యం వెండి బిందెతో నీటినితెచ్చి అభిషేకించాలని భావించి సుమారు రూ.2లక్షల విలువ చేసే వెండి బిందెను బహూకరించినట్లు వివరించారు. ఈ బిందెను ఆలయ చైర్మెన్ పుదూరు లక్ష్మణరెడ్డికి అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పూజారి జగదీష్ ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలను రాధికకు అందించారు.

ఘనంగా చినబాబు జన్మదిన వేడుకలు

పుత్తూరు, నవంబరు 8 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి చినబాబు (నల్లపునేని మురళీమోహన్) జన్మదిన వేడుకలను టిడిపి నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువా, పూలమాలలతో సత్కరించారు. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో భవిష్యత్‌లో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నంనాయుడు, ఎన్.ఎన్.ధనపాల్, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు ఎల్లంటి బాబునాయుడు, లియోన్ జ్యూస్ ఫ్యాక్టరీ అధినేత గడ్డం లోకాద్రినాయుడు, నాయకులు మల్లారపు రమేష్, బి.ఆర్.మురళీకృష్ణ, నైనేరి విక్కీరాయల్, ఇ.సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

సనాతన హిందూ ధర్మవ్యాప్తికి...కంకణబద్ధులు కావాలి

-ధర్మగిరి,గోశాలలో టిటిడి నూతన ఛైర్మన్ బిఆర్‌నాయుడు

తిరుమల,నవంబర్ 8ప్రభాతవార్తప్రతినిధి: వేదవిద్యనభ్యసించే విద్యార్థులు సనాతన ధర్మాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్ళాలని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత శుక్రవారం సాయంత్రం ఆయన ధర్మగిరిలోని వేదపాఠశాలను సందర్శించారు.ఇక్కడ వేద పాఠశాల ప్రిన్సిపాల్ కెఎస్ఎస్ అవధాని, ధర్మగిరి ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, ఆరోగ్యఅధికారి డాక్టర్ మధుసూదనప్రసాద్ పాల్గొన్నారు. తొలిసారిగా వచ్చిన ఛైర్మన్ వేదవిద్యార్థులు వేదాశీర్వచనంతో స్వాగతం పలికారు. విద్యార్థులకు అందుబాటులో ఉంటానని, సమస్యలు ఉంటే తనదృష్టికి తెస్తే పరిష్కరిస్తానని అన్నారు. గోశాలలో గోవులకు స్వయంగా దాణా తినిపించారు.

పనబాక లక్ష్మికి తెలుగు మహిళల సన్మానం

తిరుపతి,నవంబర్ 8ప్రభాతవార్త: శ్రీవారి భక్తులకు సేవచేసుకునే భాగ్యం కలిగి బోర్డు సభ్యురాలుగా ప్రమాణస్వీకారం చేసిన మాజీమంత్రి పనబాక లక్ష్మిని శుక్రవారం సాయంత్రం తెలుగు మహిళలు ఘనంగా సన్మానించారు. తెలుగుదేశంపార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.పుష్పావతి యాదవ్ పుష్ప గుచ్చంతో అభినందనలు తెలిపారు.

రబీ సాగుకు రైతులు సిద్ధం... జోరుగా వరినాట్లు

-మరోవైపు గంగ నిండా నీరు

తొట్టంబేడు, నవంబర్ 8 ప్రభాతవార్త : మండలంలో అన్నదాతలు రబీ సాగుకు సిద్ధమవుతున్నారు. తూర్పు మండలాల్లో ప్రధాన కేంద్రాలుగా శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లోనే వరి పంటను సాగుచేస్తారు. గత ఖరీఫ్ సీజన్‌లో అన్నదాతలకు బాగానే సాగువచ్చినా గిట్టుబాటు ధర మాత్రం అంతంత మాత్రమే. ప్రస్తుతం రబీ సీజన్ గతనెల అక్టోబర్ 5నుంచి ప్రారంభమైంది. మండలంలో వరి పంట 4425హెక్టార్లులో ప్రస్తుతం 600 హెక్టార్లలో సాగుచేయగా, వేరుశనగ 81 హెక్టార్లుగా ఉంది. అయితే వేరుశనగ పంట మాత్రం బోనుపల్లి, చిట్టత్తూరు, కొన్ని ప్రాంతాల్లోనే సాగుచేస్తారు. ఇక మండలంలో మొత్తం అన్ని పంటలు కలిపి 4653 హెక్టార్లలోసాగుచేస్తున్నారని వ్యవసాయాధికారి సురేంద్రరెడ్డి తెలిపారు. ప్రస్తుతం కెఎన్ఎం 1638, బిపిటి 5204, ఆర్ఎన్ఆర్‌లు 15408 రకాలు పండించాలని కోరగా, వేరుశనగ పట మాత్రం ట్యాగ్ 25 విత్తనాలు మాత్రమే సాగుచేస్తారు. గత ఖరీఫ్‌లో అన్నదాతలు 1010, 1770 హెక్టార్లలో పండించగా ధరలు మాత్రం బాగానే వచ్చాయని పెట్టుబడ